RNI No. APTEL/2009/28868

ప్రజల కోసం... ప్రజల పక్షాన...
నిజం మా నడవడి...

సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక

PEOPLE ISSUES OUR MISSION

TRUTH BRINGS A BETTER SOCIETY

CITIZEN TIMES TELUGU DAILY

సంపుటి :18	సంచిక : 347	సంపాదకులు : కంచర్ల సందీప్ కుమార్	ప్రచురణ : విశాఖపట్నం	22-10- 2026	పేజీలు : 8	వెల : 2/- రూ॥
VOLUME: 18	ISSUE : 347	EDITOR:KANCHERLA SANDEEP KUMAR	PUBLISHED: VISAKHAPATNAM	22-10-2026	PAGES: 8	PRICE : 2/- RS

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్లపై రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టత

నామినేషన్ల దాఖలుకు నో డ్యూస్ సర్టిఫికెట్ అవసరం లేదని వెల్లడి

ఈ కారణంతో నామినేషన్లను తిరస్కరించవద్దని అధికారులకు ఆదేశం

నామినేషన్ల అడ్డంకులపై సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ ప్రకటన

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియపై రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ)

తరువాయి 2లో..

'రప్పా రప్పా' అంటూ రౌడీయిజం చేస్తే సహించం..

- శాంతిభద్రతల్లో ఏపీ ఆదర్శంగా నిలవాలి
- పోలీసు అమరవీరుల సంస్మరణ దినంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- శాంతిభద్రతల పరిరక్షణలో ఏపీ దేశానికే ఆదర్శం కావాలని పిలుపు
- రాజకీయ ముసుగులో నేరాలు, రౌడీయిజంపై ఉక్కుపాదం మోపాలని ఆదేశం
- భద్రత ఉంటేనే పెట్టుబడులు వస్తాయి, అభివృద్ధి సాధ్యమని స్పష్టీకరణ
- సైబర్ నేరాలపై అప్రమత్తత, టెక్నాలజీ వినియోగం పెంచాలని పోలీసులకు సూచన
- అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ

అమరావతి, సిటిజన్ టైమ్స్

ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ శాంతిభద్రతల పరిరక్షణలో దేశానికే ఆదర్శంగా నిలవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాజకీయ ముసుగులో అరాచకాలు, రౌడీయిజం చేసేవారిని ఉక్కుపాదంతో అణచివేయాలని పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నేరస్తులకు పోలీసు యూనిఫాం చూస్తే భయం కలగాలని, అదే సమయంలో బాధితులకు పూర్తి భరోసా లభించాలని ఆయన ఆకాంక్షించారు. మంగళగిరిలోని 6వ ఏపీఎస్పీ బెటాలియన్‌లో నేడు నిర్వహించిన 'పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంతకుముందు, విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమర పోలీసులకు ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "ఖాకీ అంటే బాధ్యత, పోలీసు అంటే భరోసా. ప్రమాదం జరిగినా, నేరం జరిగినా ప్రజలకు మొదటగా గుర్తొచ్చేది పోలీసులే. ప్రజలు పండుగలు ప్రశాంతంగా జరుపుకోవడానికి పోలీసులు తమ కుటుంబ సంతోషాలను త్యాగం చేస్తున్నారు" అని అన్నారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా

తరువాయి 2లో..

నామినేషన్ల గడువు పొడిగింపుపై పిటిషన్.. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

ఏపీలోని మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్ల దాఖలుకు గడువు పొడిగించాలన్న వైకాపా పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. 19 చోట్ల తమను నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నారని ఆ పార్టీ తన పిటిషన్‌లో పేర్కొంది. దీనిపై విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం.. నామినేషన్ల గడువు మొత్తంగా వాయిదాకు, పొడిగింపునకు నిరాకరించింది. నామినేషన్ల దాఖలును అడ్డుకున్నారని ఫిర్యాదు చేసిన చోటే పరిశీలించి తగిన

తరువాయి 2లో..

వాయు కాలుష్యం ఎఫెక్ట్.. మళ్లీ ఆంక్షల చట్రంలోకి ఢిల్లీ

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం మళ్లీ పడగ విప్పుతోంది. స్థానికంగా వాయు నాణ్యత సూచీ దిగజారడంతో 'సెంట్రల్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్' ఈ సీజన్‌లో తొలిసారి ఆంక్షలు విధించింది. ఢిల్లీ - ఎన్‌సీఆర్ పరిధిలో 'గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్-1 నిబంధనలను తక్షణమే అమల్లోకి తీసుకొస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు సీఏక్యూఎం ఛైర్‌పర్సన్ రాజేశ్ వర్మ

తరువాయి 2లో..

అమెరికా-పాక్ దోస్తీ.. భారత్‌కు అగ్రరాజ్యం కీలక హామీ!

భారత్‌తో బంధానికి నష్టం జరగదని అమెరికా విదేశాంగ మంత్రి రూబియో హామీ

వాణిజ్య ఒప్పందానికి అమెరికా కట్టుబడి ఉందని స్పష్టీకరణ

పాక్‌తో సంబంధాలు ఘర్షణల నివారణకు ఉపయోగపడతాయని వెల్లడి

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

అమెరికా, పాకిస్థాన్ మధ్య సాన్నిహిత్యం పెరుగుతున్న వేళ భారత్‌కు అగ్రరాజ్యం భరోసా ఇచ్చింది. ఇతర దేశాలతో తమ సంబంధాల వల్ల భారత్‌తో బంధానికి ఎలాంటి నష్టం జరగదని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో స్పష్టం చేశారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందం, పరస్పర సహకారానికి తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో రూబియో ఈ

తరువాయి 2లో..

జగన్‌కు షాక్..

సొంత జిల్లాలో టీడీపీ ఖాతాలోకి ఏకగ్రీవంగా 6 మున్సిపాలిటీలు

వైసీపీ అధినేత జగన్ సొంత జిల్లా కడపలో ఆ పార్టీకి ఎదురుదెబ్బ

రాయచోటి, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు వంటి కీలక స్థానాలు టీడీపీ వశం

నామినేషన్లను అడ్డుకున్నారంటూ వైసీపీ ఆరోపణలు

అమరావతి, సిటిజన్ టైమ్స్

రాష్ట్ర రాజకీయాల్లో సంచలన పరిణామం చోటుచేసుకుంది. వైసీపీ అధినేత జగన్ సొంత జిల్లా కడపలో ఆ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఉమ్మడి కడప జిల్లాలోని కీలక మున్సిపాలిటీలను టీడీపీ నేతృత్వంలోని కూటమి ఏకగ్రీవంగా కైవసం చేసుకుని రాజకీయంగా ప్రకంపనలు సృష్టించింది. ఈ విజయాలతో జిల్లాపై టీడీపీ పట్టు సాధించినట్లయింది. తాజా పరిణామాల ప్రకారం...

తరువాయి 2లో..

పాక్ నేత ముందే ఉగ్రవాదంపై గట్టిగా మాట్లాడిన రాజ్‌నాథ్

ఉగ్రవాద నిర్మూలనలో ద్వంద్వ ప్రమాణాలు తగవన్న రాజ్‌నాథ్ సింగ్

టెర్రరిస్టులకు నిధులు, ఆశ్రయం ఇచ్చేవారిని వదలొద్దని వ్యాఖ్య

తజికిస్థాన్‌లో జరిగిన ఎస్‌సీవో సమావేశంలో పాల్గొన్న భారత రక్షణ మంత్రి

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

ఉగ్రవాద వ్యవస్థను సమష్టిగా, దృఢ సంకల్పంతో సమూలంగా నిర్మూలించాలని, ఈ విషయంలో ఎటువంటి ద్వంద్వ ప్రమాణాలకు తావుండకూడదని కేంద్ర రక్షణ శాఖ మంత్రి

తరువాయి 2లో..

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్రమ వలసదారులపై ఉక్కు పాదం మోపుతున్న డొనాల్డ్ ట్రంప్.. వీసాల విషయంలో కూడా కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో రెండోసారి అధికారంలో వచ్చినప్పటి నుంచి ఆయన సుమారు మూడు లక్షల వీసాలను రద్దు చేసినట్లు తెలిసింది. వీటిలో 'బర్త్ టూరిజం' కోసం వచ్చినవారివే ఎక్కువ ఉన్నాయి. అలాంటి చర్యలకు సహకరించారని ఆరోపణలు ఉన్నవారికి సంబంధించిన

తరువాయి 2లో..

ఎడిటోరియల్

మంత్రులు, ఎమ్మెల్యేలకు...
బాబు మార్క్ ఆదేశం

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల వేడి పీక్స్ కి చేరుకుంది. మొదటి విడత ఎన్నికలకు సరిగ్గా వారమే సమయం ఉంది. దాంతో పాటు పది రోజుల వ్యవధిలో తొలి ఫలితాలు వస్తాయి. ఏపీలో జనం మూడ్ ఏంటో కూడా ఈ ఫలితాలు నిర్ణయిస్తాయి. ఈ నేపథ్యంలో ఏపీ సీఎం టీడీపీ అధినేత చంద్రబాబు టీడీపీకి చెందిన ప్రజాప్రతినిధులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇది కీలకమైన టెలీ కాన్ఫరెన్స్ గా చెప్పుకోవాలి. ఈ సందర్భంగా బాబు చేసిన దిశా నిర్దేశం అయితే పార్టీని మొత్తం లోకల్ బాడీ ఎన్నికల కోసం సమాయత్త పరచినట్లు అయింది. స్థానిక సంస్థల ఎన్నికలు ఎంత ముఖ్యమో చంద్రబాబు వివరించిన తీరు చూస్తే అర్థం అవుతోంది. ఆయన మంత్రులు ఎమ్మెల్యేలు పార్టీ కార్యకర్తలుగా మారి పని చేయాలని కోరారు. అంతే కాదు ఇంటింటి ప్రచారంతో పాటు బూత్ స్థాయి వరకూ కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ విషయంలో గ్రౌండ్ లెవెల్ లో ఫోర్ ఫ్రంట్ లో మంత్రులు ఎమ్మెల్యేలు నిలబడాలని బాబు గట్టిగా స్పష్టం చేశారు. దాంతో టీడీపీ అధినాయకత్వం స్థానిక సంస్థల ఎన్నికలను ఎంత ప్రతిష్టగా తీసుకుంది అన్నది చూడాల్సి ఉంది. ఇక చాలా చోట్ల కూటమి పొత్తులకు వ్యతిరేకంగా తాత్కాలిక ప్రయోజనాల కోసం అభ్యర్థులను నిలబెట్టవద్దని చంద్రబాబు స్ట్రాంగ్ మేసేజ్ ని పంపించారు. అలా కనుక చేస్తే ఊరుకోమని కూడా హెచ్చరించారు. కూటమి పొత్తులను అందరూ గౌరవించాలని ఆయన కోరారు. ఒక వేళ సమీకరణాలు, పొత్తుల్లో భాగంగా ఎవరికైనా సీట్లు దక్కకపోతే నామినేటెడ్ పదవులలో వారికి స్థానం కల్పిస్తామని బాబు భరోసా ఇచ్చారు. ఏపీలో విలువలు లేని రాజకీయాలు, రౌడీయిజం, అధికార దుర్వినియోగంతో చేసే రాజకీయం ఎప్పుడూ నిలబడదని పరోక్షంగా వైసీపీ మీద బాబు నిప్పులు చెరిగారు. ఆ పార్టీ అనుసరిస్తున్న విధానాలను ఆయన ఎండగట్టారు. టీడీపీ కూటమి ప్రజలు మంచి చేసి జనంలోకి వెళ్తోంది అని ఆయన అన్నారు. ఆ విషయాన్ని పార్టీ నేతలు అంతా జనాలకు వివరించాలని ఆయన కోరుకున్నారు. ఇక కూటమిలో ఐక్యత ముఖ్యమని పొత్తులు అన్నవి కట్టుదిట్టంగా అమలు కావాలని కూడా బాబు చెప్పుకొచ్చారు. మొత్తం మీద మంత్రులు ఎమ్మెల్యేలతో పాటు పార్టీకి చెందిన సీనియర్ నాయకులు అంతా జనంలోకి వెళ్లాలని ఈ ఎన్నికలను చాలా సీరియస్ గా తీసుకోవాలని చంద్రబాబు అయితే సందేశం ఇచ్చారు. అదే విధంగా పార్టీకి కూటమిని మంచి ఫలితాలు రావాలని ఆకాంక్షించారు.

జగన్‌కు షాక్..

ప్రొద్దుటూరు, బద్వేల్, జమ్మలమడుగు, రాయచోటి, రాజంపేట, కమలాపురం మున్సిపల్ ఛైర్మన్ పీఠాలను టీడీపీ ఏకగ్రీవంగా దక్కించుకుంది. ముఖ్యంగా రాయచోటిలోని మొత్తం 44 వార్డులను కూటమి పార్టీలు ఏకగ్రీవంగా గెలుచుకోవడం విశేషం. మిత్రపక్షమైన బీజేపీకి ఎర్రగుంట్ల మున్సిపాలిటీని కేటాయించి కూటమి ఐక్యతను చాటుకుంది. అంతేకాకుండా, జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల మున్సిపాలిటీపై కూడా టీడీపీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. అయితే, ఈ ఏకగ్రీవాలపై వైసీపీ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. అధికార కూటమి అక్రమాలు, దౌర్జన్యాలతో తమ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకుందని, కొన్నిచోట్ల నామినేషన్ పత్రాలను అక్రమంగా తిరస్కరించారని ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. దాడులు, బెదిరింపులతో తమను ఎన్నికల నుంచి తప్పించలేరని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు, ఈ విజయాలపై కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి స్పందిస్తూ... ఉమ్మడి కడప జిల్లాలో ప్రజలు సరికొత్త రాజకీయ మార్పును కోరుకుంటున్నారని, రాబోయే రోజుల్లో మరిన్ని వినూత్న పరిణామాలు చూస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఫలితాలు కడప జిల్లా రాజకీయ సమీకరణాల్లో కీలక మార్పులకు సంకేతంగా నిలుస్తున్నాయి.

'రప్పా రప్పా' అంటూ
రౌడీయిజం చేస్తే సహించం..

దసరా ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్, వీఐపీల పర్యటనలు ప్రశాంతంగా ముగియడం వెనుక పోలీసుల నిరంతర శ్రమ అభినందనీయమని కొనియాడారు. 1959లో లడఖ్‌లో చైనా సైనికులతో పోరాడుతూ పది మంది పోలీసులు ప్రాణాలర్పించారని, వారి త్యాగాలకు గుర్తుగా ఏటా ఈ దినాన్ని జరుపుకుంటున్నామని గుర్తుచేశారు.

శాంతిభద్రతలతోనే అభివృద్ధి, పెట్టుబడులు

రాష్ట్రంలో శాంతిభద్రతలు, అభివృద్ధి, ప్రజల సంతోషం ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని చంద్రబాబు విశ్లేషించారు. "భద్రత, భరోసా ఉన్న చోటకే పరిశ్రమలు, పెట్టుబడులు వస్తాయి. తద్వారానే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. అందుకే తాను అధికారంలో ఉన్న ప్రతిసారీ శాంతిభద్రతలకే అత్యంత ప్రాధాన్యత ఇస్తాను" అని పునరుద్ఘాటించారు. గతంలో ఫ్యాక్షన్‌ను నియంత్రించడం, నక్సలిజాన్ని ఎదుర్కోవడం, మత ఘర్షణలను అరికట్టడంలో ఏపీ పోలీసులు చూపిన ధైర్యసాహసాలు అసాధారణమైనవని ప్రశంసించారు. ఇటీవల దేశ భద్రతకు సంబంధించిన కుట్రలను ఛేదించిన కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

ఆధునిక నేరాలకు టెక్నాలజీతో చెక్

మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల స్వరూపం కూడా మారుతోందని, పోలీసు శాఖ దర్యాప్తు పద్ధతుల్లో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సీఎం సూచించారు. "ఒకే ఒక్క ఫోన్ కాల్, ఒక లింక్‌తో కష్టపడి సంపాదించుకున్న సొమ్మును సైబర్ నేరగాళ్లు కొల్లగొడుతున్నారు. చదువుకున్నవారు సైతం మోసపోతున్నారు. ఇలాంటి నేరాలు జరగకుండా నివారించడమే ఉత్తమ పోలీసింగ్" అని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా అనలిటిక్స్, డ్రోన్ టెక్నాలజీ వంటి వాటిని పూర్తిస్థాయిలో వినియోగించి దర్యాప్తు సామర్థ్యాన్ని పెంచుకోవాలని కోరారు. గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణలో 'ఈగల్' బృందం చేస్తున్న కృషిని అభినందించారు. మహిళలపై నేరాలకు పాల్పడాలంటేనే భయపడే వాతావరణం కల్పించాలని ఆదేశించారు.

అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం

పోలీసు అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. పోలీసుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తీవ్రమైన ఒత్తిడితో పనిచేసే పోలీసులు యోగా, ధ్యానం ద్వారా మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని సూచించారు. అమరుల త్యాగాలకు అసలైన నివాళి అర్పించాలంటే ప్రజలకు నిరంతర భద్రత కల్పించడమే మార్గమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు అమర జవాన్ స్మృతిచిహ్నం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం 'షహీద్ పుస్తక్ టోలీ', 'అమరులు వారు' పుస్తకాలను ఆవిష్కరించారు. పోలీసు శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి, ఫోరెన్సిక్, విపత్తు నిర్వహణ, ఆక్టోపస్ విభాగాల ఆధునిక ఆయుధాల గురించి అడిగి తెలుసుకున్నారు.

వలసలపై డొనాల్డ్ ట్రంప్ ఉక్కు పాదం.. 3 లక్షల వీసాల రద్దు

నాలుగు వేల వీసాలూ అందులో ఉన్నట్లు సమాచారం. మిగిలిన వారు హింస, ప్రజా భద్రతకు ముప్పు, మోసం, తప్పుడు సమాచార వ్యాప్తి, మద్యం తాగి వాహనం నడపడం వంటి ఉల్లంఘనలకు పాల్పడినట్లుగా స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. వాటిని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి టామీ పిగాట్ ధ్రువీకరించారు. అయితే, రద్దు చేసిన వీసాదారుల్లో ఏ దేశీయులు ఎక్కువ మంది ఉన్నారనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. చరిత్రలో మరే అధ్యక్షుడు చేయని విధంగా ట్రంప్ అత్యధిక వీసాలు రద్దు చేసినట్లు విదేశాంగ శాఖ ప్రతినిధి తెలిపారు. అమెరికాలో ఉంటూ చట్టాన్ని ఉల్లంఘించేలా, జాతీయ భద్రతకు ముప్పు కలిగించేలా వ్యవహరించే విదేశీ పౌరులపై తమ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. మొత్తం రద్దయిన మూడు లక్షల వీసాల్లో రెండున్నర లక్షలు గతేడాది జనవరిలో రద్దు చేసినట్లు తెలిపారు.

వీసాల రద్దు రెట్టింపు

గతేడాది జనవరిలో ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టిన అనంతరం అక్రమ వలసదారులను వెనక్కి పంపించే కార్యక్రమం చేపట్టారు. దీంతోపాటు సోషల్ మీడియా వెట్టింగ్ (వీసా జారీ చేయడానికి ముందు అభ్యర్థి సోషల్ మీడియా ఖాతాలన్నీ పరిశీలించడం)తో పాటు స్క్రీనింగ్‌ను విస్తృతం చేశారు. స్థానిక చట్టాలను ఉల్లంఘించే వారి వీసాల రద్దును ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలోనే వీసాల రద్దు గతంతో పోలిస్తే రెట్టింపు అయినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. గడువు ముగిసినా అక్రమంగా దేశంలో ఉండటం, స్థానిక చట్టాలను ఉల్లంఘించడం లాంటి పనులు చేస్తున్న విదేశీ విద్యార్థులపైనా ట్రంప్ యంత్రాంగం నిఘా పెట్టింది.

పాక్ నేత ముందే ఉగ్రవాదంపై గట్టిగా మాట్లాడిన రాజ్‌నాథ్

రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. తజికిస్థాన్ రాజధాని దుషాంబేలో నిర్వహించిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) దేశాల ప్రభుత్వాధినేతల మండలి సమావేశంలో ఆయన ఈ మేరకు ప్రసంగించారు. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించిన రాజ్‌నాథ్ సింగ్.. ఉగ్రవాదులకు నిధులు సమకూర్చేవారు, వారికి మద్దతుగా నిలిచేవారు, ఆశ్రయం కల్పించే శక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని, వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదని స్పష్టం చేశారు. ఉగ్రవాదం కేవలం అమాయకుల ప్రాణాలను బలి తీసుకోవడమే కాకుండా, విదేశీ పెట్టుబడులు, అంతర్జాతీయ వాణిజ్యానికి తీవ్ర ఆటంకంగా పరిణమించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది సమాజాన్ని తీవ్రవాదం వైపు మళ్లించి, యువత ఉజ్వల భవిష్యత్తును, అవకాశాలను దెబ్బతీస్తుందని ఆయన వివరించారు. పాకిస్థాన్ ఉప ప్రధాన మంత్రి ఇషాక్ దార్ సమక్షంలోనే రాజ్‌నాథ్ ఈ ఘాటు వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సందర్భంగా, భారత్ ఆతిథ్యమివ్వనున్న తొలి 'ఎస్‌సీవో సివిలైజేషన్ డైలాగ్ ఫోరమ్'కు సభ్య దేశాలన్నింటినీ రాజ్‌నాథ్ సింగ్ సాదరంగా ఆహ్వానించారు. సభ్య దేశాల మధ్య ప్రజల సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు, ప్రాచీన నాగరికతలు, కళలు, సాహిత్యం, సంప్రదాయాల విశిష్టతను ప్రపంచ వేదికపై చాటిచెప్పడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గతంలో ఈ ఫోరమ్‌ను ప్రతిపాదించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

అమెరికా-పాక్ దోస్తీ.. భారత్‌కు అగ్రరాజ్యం కీలక హామీ!

వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌తో సంబంధాలు అవసరమేనని రూబియో అన్నారు. ఆ దేశంతో తమకున్న సంబంధాలను సానుకూలంగా ఉపయోగించుకోవచ్చని చెప్పారు. భారత్‌ను ఆందోళనకు గురిచేసే చర్యలను పాకిస్థాన్ నిరుత్సాహపరిచేలా తమ ప్రభావాన్ని ఉపయోగిస్తామని తెలిపారు. తద్వారా ప్రాంతీయ ఘర్షణలు తలెత్తకుండా చూడవచ్చని అభిప్రాయపడ్డారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందం కోసం చేస్తున్న ప్రయత్నాలు, ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న చర్చలు తమ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులను 1970ల నాటి అమెరికా విదేశాంగ విధానంతో పోల్చడం సరికాదని రూబియో అన్నారు. అప్పట్లో ప్రచ్ఛన్న యుద్ధం సహా అనేక పరిణామాలు ఉన్నాయని గుర్తుచేశారు. ఇప్పుడు ప్రపంచ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని చెప్పారు. అప్పట్లో అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ హయాంలో పాకిస్థాన్ సైనిక పాలకులకు వాషింగ్టన్ మద్దతుగా నిలిచింది. రెండు రోజుల భారత పర్యటనలో ఉన్న రూబియో రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపైనా స్పందించారు. నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఈ యుద్ధానికి పరిష్కారం కనుగొనడం అంత సులువు కాదని అన్నారు. సమస్యను పరిష్కరించడం తేలికై ఉంటే ఇప్పటికే యుద్ధం ముగిసిపోయేదని వ్యాఖ్యానించారు.

మొదటి పేజీ తరువాయి

నామినేషన్ల గడువు పొడిగింపుపై పిటిషన్.. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

నిర్ణయం తీసుకోవాలని ఎస్‌ఈసీని ఆదేశించింది.

సుప్రీంకోర్టు ఆదేశాలపై వైకాపాది తప్పుడు ప్రచారం: తెదేపా

నామినేషన్లపై ఇప్పటికే ఫిర్యాదులు అందిన చోటే ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నామినేషన్లకు అవకాశం కల్పిస్తే జిల్లా కలెక్టర్ వద్ద కూడా దాఖలుకు పరిశీలించాలని, దీనిపై గురువారంలోపు నిర్ణయం తీసుకోవాలని ఎస్‌ఈసీకి సూచించింది. మరోవైపు అభ్యర్థుల తుది జాబితా ప్రకటన గడువును ఈనెల 25 వరకు సుప్రీంకోర్టు పొడిగించింది. కోర్టుల్లో కేసులు వేయడం తప్ప.. ఎక్కడా ఫిర్యాదులు చేయలేదని ఎస్‌ఈసీ తెలిపింది. తమ ఆదేశాలపై తీసుకున్న చర్యలపై ఈనెల 27న నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

వైకాపా నేతలు తీవ్ర హింసకు పాల్పడ్డారు: ఎస్‌ఈసీ తరఫు న్యాయవాదులు

విచారణ సందర్భంగా వైకాపా ఎంపీలు, నేతలు పలుచోట్ల వ్యవహరించిన తీరును రాష్ట్ర ఎన్నికల సంఘం తరఫు న్యాయవాదులు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నామినేషన్ కేంద్రంలో ఎంపీ మిథున్‌రెడ్డి, ఆయన అనుచరులు చేసిన అరాచకాలను వివరించారు. నామినేషన్ కేంద్రంలో ఉన్న వారిని కారుతో ఢీ కొట్టించిన అంశాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈనెల 15, 16వ తేదీల్లో దురుద్దేశంతో తీవ్ర హింసాత్మక ఘటనలకు పాల్పడ్డారని.. రాజకీయ కుట్రకు తెరలేపారని ఎస్‌ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా తెలిపారు. వైకాపా అరాచకంతో భద్రత మధ్య ప్రజలను తరలించాల్సి వచ్చిందన్నారు. పంజాబ్‌లోని పఠాన్‌కోట్ ప్రాంతం నుంచి మారణాయుధాలతో దుండగులను వైకాపా దిగుమతి చేసుకుందని.. వారిని పోలీసులు అరెస్ట్ చేశారని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పంజాబ్ నుంచి వచ్చిన అంతర్రాష్ట్ర ముఠాల దగ్గర ఆయుధాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. శాంతి భద్రతలను పరిరక్షించడంలో ప్రభుత్వం ఎక్కడా రాజీ పడలేదని ప్రభుత్వం తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు.

వాయు కాలుష్యం ఎఫెక్ట్.. మళ్లీ ఆంక్షల చట్రంలోకి దిల్లీ

అధ్యక్షతన దిల్లీ ఉన్నతాధికారులు, పలు ప్రభుత్వ ఏజెన్సీలతో సమక్షా సమావేశం జరిగింది. నగరంలో వాయు కాలుష్య సమస్యలను సమీక్షించడంతో పాటు రాబోయే రోజుల్లో కాలుష్య నివారణ చర్యల్ని బలోపేతం చేయడంపై చర్చించారు. దిల్లీలో ఈ నెల 20న వాయు నాణ్యత సూచీ 179గా (మధ్యస్థ కేటగిరీ) నమోదు కాగా.. బుధవారం మధ్యాహ్నం 2గంటలకు 244 (పూర్ కేటగిరీ)కి ఒక్కసారిగా పెరిగిందని సీఏక్యూఎం ఓ ప్రకటనలో పేర్కొంది. రాబోయే రోజుల్లో వాయు నాణ్యత సూచీ 'పూర్' కేటగిరీలోనే ఉంటుందని భారత వాతావరణ శాఖ, ఇతర సంస్థలు అంచనా వేసినట్లు తెలిపింది. వాయు నాణ్యత మరింతగా క్షీణించకుండా నిరోధించేందుకు జీఆర్‌ఏపీ-1 నిబంధనలను వెంటనే అమలు చేయాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా గ్రాప్-1 కింద హోటళ్లు, రెస్టారంట్లలో ఇంధనంగా బొగ్గు, వంట చెరకు వినియోగం నిషేధం, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే డీజిల్ జనరేటర్ల వాడకానికి అనుమతించడం వంటి ఆంక్షలను అమలు చేస్తున్నట్లు పేర్కొంది.

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్లపై రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టత

కీలకమైన స్పష్టత ఇచ్చింది. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులు 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్' (ఎన్‌ఓసీ) లేదా 'నో డ్యూస్ సర్టిఫికెట్' సమర్పించాల్సిన అవసరం లేదని బుధవారం స్పష్టం చేసింది. ఈ మేరకు అమరావతి నుంచి ఎస్‌ఈసీ ఒక ప్రకటన విడుదల చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల చట్టాల ప్రకారం ఈ పత్రాలు తప్పనిసరి కాదని పేర్కొంది. కేవలం ఈ సర్టిఫికెట్లు లేవన్న కారణంతో నామినేషన్ల స్వీకరణను నిలిపివేయవద్దని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే, నామినేషన్‌కు అవసరమైన ఇతర పత్రాలను మాత్రం అభ్యర్థులు తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందని తెలిపింది. రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఈ స్పష్టత ప్రాధాన్యం సంతరించుకుంది. కొన్ని ప్రాంతాల్లో తమ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని, దాడులకు పాల్పడుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ వివాదాల నేపథ్యంలో కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం, నామినేషన్ల అడ్డంకులపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించాలని ఎస్‌ఈసీని ఆదేశించింది. అవసరమైతే ప్రభావిత ప్రాంతాల్లో కనీసం 48 గంటల పాటు గడువు పొడిగింపుపై గురువారం నాటికి నిర్ణయం తీసుకోవాలని సూచించింది. అలాగే, అక్టోబర్ 25 వరకు అభ్యర్థుల తుది జాబితాను ప్రచురించవద్దని ఆదేశించింది. ఈ పరిణామాల మధ్య, ఎటువంటి సాంకేతిక అడ్డంకులు లేకుండా నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు వీలుగా ఎస్‌ఈసీ ఈ తాజా మార్గదర్శకాలను జారీ చేసింది.

జనసేనకు జోష్.. వైసీపీకి భారీ షాక్!

పంచకర్ల సందీప్ సమక్షంలో జనసేనలో చేరిన 200 కుటుంబాలు

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 21

విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం కృష్ణాపురం గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన మాజీ సర్పంచులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు సహా సుమారు 200 కుటుంబాలు జనసేన పార్టీలో చేరాయి. భీమిలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు పంచకర్ల సందీప్ సమక్షంలో బుధవారం జరిగిన ఈ చేరికలు స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

మాజీ సర్పంచులు, సీనియర్ నాయకులు చేరిక

కృష్ణాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచులు బోలో అప్పలనాయుడు, సురల బంగారయ్య, మాజీ కో-ఆపరేటివ్ డైరెక్టర్ కనకల దేముడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త మొకర పైడినాయుడు, వైసీపీ నాయకుడు బోను నాగరాజుతో పాటు పలువురు వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ కుటుంబ సభ్యులతో కలిసి జనసేనలో

చేరారు. వీరితో పాటు గ్రామానికి చెందిన సుమారు 200 కుటుంబాలు జనసేన పార్టీ కండువాలు కప్పుకొని పార్టీలో చేరగా, పంచకర్ల సందీప్ వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి

జనసేనలో చేరిన నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ కృష్ణాపురం గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీని విస్తరించడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

పద్మనాభం మండలంలో జనసేనకు కొత్త ఉత్సాహం

కృష్ణాపురంలో పెద్ద సంఖ్యలో కుటుంబాలు జనసేనలో చేరడం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ చేరికలతో పద్మనాభం మండలంలో జనసేనకు మరింత బలం చేకూరుతుందని పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత

24 గంటల సీసీటీవీ నిఘా తప్పనిసరి: కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

సిటిజన్ టైమ్స్, విశాఖపట్నం, అక్టోబర్ 21:

పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల రెండో సాధారణ ఎన్నికలు--2026లో పోలైన బ్యాలెట్ బాక్సుల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం బ్యాలెట్ బాక్సుల రవాణా, భద్రపరిచే ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులతో పాటు ప్రిసైడింగ్ అధికారి డైరీ, బ్యాలెట్ పేపర్ అకౌంట్‌ను పోలీసు భద్రత మధ్య నిర్దేశిత వాహనాలు, మార్గాల ద్వారా రిసెప్షన్ కేంద్రాలకు తరలించాలని సూచించారు. అభ్యర్థులు, వారి పోలింగ్ ఏజెంట్లు వాహనాలను అనుసరించేందుకు అనుమతించాలని, వారి ప్రతినిధుల సమక్షంలోనే బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచాలని పేర్కొన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లకు రెండు అంచెల భద్రత కల్పించడంతో పాటు రెండు తాళాల విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. గదుల లోపల, ప్రవేశ ద్వారాల వద్ద, పరిసర ప్రాంతాల్లో 24 గంటల పాటు సీసీటీవీ నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌కు 100 మీటర్ల పరిధిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సీసీటీవీ దృశ్యాలను వీక్షించేలా స్క్రీన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్‌లను తెరిచే, మూసివేసే ప్రతి సందర్భంలో అభ్యర్థులు లేదా వారి ప్రతినిధులు హాజరయ్యేలా చూడాలని, ఆ ప్రక్రియను వీడియో చిత్రీకరించాలని తెలిపారు. ఓట్ల లెక్కింపు రోజున కూడా ప్రతినిధుల సమక్షంలోనే స్ట్రాంగ్ రూమ్‌లను తెరవాలన్నారు. రిటర్నింగ్ అధికారులు భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేసి, లాగ్‌బుక్‌లు, వీడియో రికార్డులను పరిశీలించాలని సూచించారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేసి పోలైన బ్యాలెట్ బాక్సులకు పూర్తి భద్రత కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు.

టీడీపీలోకి చేరిన మజ్జిపేట వైసీపీ నాయకులు



భీమిలి సిటిజెన్ టైమ్స్ అక్టోబర్ 21:

భీమిలి మండలం మజ్జిపేట గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరారు. ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మజ్జి వెంకటరావు సహా 100 మందికి పసుపు కండువాలు వేసి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో జరుగుతున్న ప్రగతిని చూసి వైసీపీ నాయకులు అనేక మంది టీడీపీలో చేరడానికి ముందుకు వస్తున్నారని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో ఏకపక్ష విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారిలో మజ్జి స్వామి నాయుడు, మజ్జి జానకి రావు, కోరాడ అప్పలరాజు, మజ్జి వనజ, ఎన్ని రామారావు, మజ్జి సోమునాయుడు, కాసు బాబు, కాదా రామారావు, యర్రాజీ వెంకటరావు, మజ్జి సూరినాయుడు, యర్రాజీ గౌరీ, నీలాపు అప్పారావు, మీసాల అప్పలరాజు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు చిక్కాల విజయ్ బాబు, గాడు వెంకటప్పుడు, సరగడ అప్పారావు, గాడు తాతినాయుడు, వెంకట నారాయణ, గుడ్డాల ఎల్లయ్య, మజ్జి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభంలో టీడీపీకి జోష్.. నూతన కార్యాలయం ప్రారంభం

పద్మనాభం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 21

యువ నాయకుడు గంటా రవితేజ చేతుల మీదుగా పద్మనాభం మండలంలో టీడీపీ నూతన కార్యాలయం ప్రారంభమైంది. ఈ సందర్భంగా బీఆర్ తాళ్లవలస, భాంధేవపురం గ్రామాలకు చెందిన 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి గంటా రవితేజ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. గ్రామీణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు.

స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

ఎంసీఎంసీ, మీడియా కేంద్రం ప్రారంభం.. జిల్లా కలెక్టర్ టి. నిశాంతి

సిటిజన్ టైమ్స్, పాడేరు, అక్టోబర్ 21:

అల్లూరి సీతారామరాజు జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేపడుతోందని జిల్లా కలెక్టర్ టి. నిశాంతి, ఐఏఎస్ తెలిపారు. బుధవారం పాడేరు జిల్లా కలెక్టరేట్‌లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ), మీడియా కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఎన్నికల పరిశీలకుడు ఆర్. కూర్మనాథ్‌తో కలిసి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో సమావేశమై ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

జిల్లాలో 11 జెడ్పీటీసీ, 172 ఎంపీటీసీ స్థానాలు

జిల్లాలోని 11 మండలాల్లో మొత్తం 11 జెడ్పీటీసీ, 172 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల విధులకు అధికారులను, సిబ్బందిని నియమించి, వారికి తగిన శిక్షణ, అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తూ ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

అక్టోబర్ 21 నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు అక్టోబర్ 21 నుంచి 23వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్లను సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాల్లో, జెడ్పీటీసీ అభ్యర్థుల నామినేషన్లను పాడేరులోని ఐటీడీఏ కార్యాలయంలో స్వీకరిస్తామని వివరించారు. అభ్యర్థులు అవసరమైన దరఖాస్తులు, ధ్రువపత్రాలను సిద్ధం చేసుకొని ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నామినేషన్లు సమర్పించాలని సూచించారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దు

ఎన్నికల విధులకు నియమితులైన అధికారులు, సిబ్బంది సమయపాలన, క్రమశిక్షణ పాటిస్తూ తమకు అప్పగించిన బాధ్యతలను నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని, విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

ఎన్నికల సమయంలో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసు శాఖతో సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని పేర్కొన్నారు. ఓటర్లు ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపడతామని చెప్పారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు. ప్రచార కార్యక్రమాలను ప్రశాంతంగా, పరస్పర గౌరవంతో, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని కోరారు. ఎన్నికలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

ఎన్నికల ప్రచారంపై ఎంసీఎంసీ నిఘా

ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ ద్వారా రాజకీయ ప్రకటనల పరిశీలన, ధ్రువీకరణ, ఎన్నికల ప్రచార ప్రకటనల పర్యవేక్షణతో పాటు పెయిడ్ న్యూస్‌కు సంబంధించిన అంశాలను నిబంధనల ప్రకారం పరిశీలిస్తామని కలెక్టర్ వివరించారు. జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా కేంద్రం ద్వారా ఎన్నికలకు సంబంధించిన అధికారిక సమాచారం, నామినేషన్ల వివరాలు, ఇతర ముఖ్యమైన సమాచారాన్ని మీడియా ప్రతినిధులకు సకాలంలో అందిస్తామని పేర్కొన్నారు.

వాస్తవ నిర్ధారణతో వార్తలు ప్రచురించాలి

ఎన్నికల సమయంలో ప్రజలకు కచ్చితమైన, విశ్వసనీయమైన సమాచారాన్ని అందించడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ అన్నారు. ఎన్నికలకు సంబంధించిన వార్తలను ప్రచురించే ముందు అధికారిక వర్గాల ద్వారా వాస్తవాలను నిర్ధారించుకోవాలని సూచించారు. నిర్ధారణ కాని సమాచారం, తప్పుడు వార్తల వల్ల ప్రజల్లో గందరగోళం ఏర్పడకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. అర్హులైన ఓటర్లందరూ ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిడికి లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, మీడియా ప్రతినిధులు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాడేరు సబ్ కలెక్టర్ కె. చిరంజీవి నాగ వెంకట సాహిత్, ఏఎస్పీ శ్రుతి, డీఎస్పీ రాజసింహారెడ్డి, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ స్థానాలకు మొదటి రోజు మూడు నామినేషన్లు

పరిషత్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ జి. విద్యాధరికి నామినేషన్ పత్రాల సమర్పణ

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 21:

విశాఖపట్నం జిల్లాలో గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో భాగంగా మొదటి రోజు బుధవారం జెడ్పీటీసీ స్థానాలకు ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రంలో రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరికి అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను సమర్పించారు. పద్మనాభం జెడ్పీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీకి చెందిన కాళ్ల పద్మ, కాళ్ల సత్యవతి నామినేషన్లు దాఖలు చేయగా, ఆనందపురం జెడ్పీటీసీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మజ్జి వెంకటరావు నామినేషన్ పత్రాలను సమర్పించారు. దీంతో మొదటి రోజు జెడ్పీటీసీ స్థానాలకు మొత్తం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం అభ్యర్థులు నిర్ణీత గడువులోగా తమ నామినేషన్లను సమర్పించాలని ఎన్నికల అధికారులు సూచించారు.

విశాఖ మేయర్ పీఠంపై కూటమి గురి.. మేయర్ అభ్యర్థిగా ముక్కా శ్రావణి!

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 21:

విశాఖపట్నం మహా నగరపాలక సంస్థ మేయర్ పదవికి కూటమి అభ్యర్థిగా ముక్కా శ్రావణి బరిలో నిలవనున్నారు. ఈ మేరకు బుధవారం విశాఖపట్నం ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్, టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చోడే పట్టాభి చేతుల మీదుగా ఆమె బి-ఫారం అందుకున్నారు. కూటమి తరపున మేయర్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు అధికారికంగా బి-ఫారం అందుకోవడంతో ముక్కా శ్రావణి అభ్యర్థిత్వానికి సంబంధించి కీలక ముందడుగు పడింది. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కూటమి నేతలు పాల్గొని ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. విశాఖపట్నం నగర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, నగర సమస్యల పరిష్కారం వంటి అంశాలే లక్ష్యంగా కూటమి ముందుకు సాగుతోందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. మేయర్ ఎన్నికల నేపథ్యంలో కూటమి అభ్యర్థిగా ముక్కా శ్రావణికి బి-ఫారం అందించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. మేయర్ ఎన్నికల్లో కూటమి విజయం సాధించి నగర పాలనలో కీలక పాత్ర పోషించడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగుతున్నారు.

పోలీసు అధికారులకు వైఁస్ మెన్ ఇంటర్నేషనల్ ఘన సన్మానం

సిటిజన్ టైమ్స్, విశాఖపట్నం, అక్టోబర్ 21

పోలీసు సంస్మరణ దినోత్సవం సందర్భంగా సమాజ రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణకు అంకితభావంతో సేవలందిస్తున్న పోలీసు అధికారులను వైఁస్ మెన్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బుధవారం సూర్యాబాగ్‌లోని పోలీస్ బ్యారక్స్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 23 మంది పోలీసు అధికారులకు సత్కారం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, ఐపీఎస్, గౌరవ అతిథిగా ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ బెస్టీ విలియమ్స్ హాజరయ్యారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. పోలీసుల ధైర్యసాహసాలు, త్యాగాలు సమాజానికి ఆదర్శమని నిర్వాహకులు పేర్కొన్నారు. వైఁస్ మెన్ క్లబ్ ఆఫ్ విజాగ్ స్టీల్, వైఁస్ మెన్ క్లబ్ ఆఫ్ వైజాగ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు. "ధైర్యం, త్యాగం, సేవలకు మా సెల్యూట్" అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం పోలీసు శాఖకు, సమాజానికి మధ్య స్నేహభావాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా సాగింది.

ఉత్సాహంగా సి పి ఎం రెండో వార్డు అభ్యర్థి మూర్తి ఎన్నికల ప్రచారం

తగరపువలస సిటిజెన్ టైమ్స్ అక్టోబర్ 21:
తగ రపువలస ఈ నెల 28 న జరుగనున్న జి వి ఎం సి ఎన్నికల్లో భాగంగా రెండో వార్డు నుంచి సి పి ఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆర్ ఎస్ ఎన్ మూర్తి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సి ఐ టి యు నాయకులు, కార్యకర్తల తో కలిసి బుధ వారం వార్డు పరిధిలో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. బాలాజీ నగర్, యాత పేట, గొల్ల వీధి ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. సి పి ఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే వార్డు సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.50 చదరపు గజాల లోపు ఉన్న ఇళ్లకు చట్ట ప్రకారం ఏడాదికి రూ 50 లు ఆస్తి పన్ను విధానం అమలు కోసం పోరాటం చేస్తామన్నారు రెండో వార్డు లో అర్హులందరికీ పింఛన్లు, ఇళ్లు , ఇళ్ల స్థలాల మంజూరు కోసం ప్రయత్నం చేయనున్నట్లు తెలిపారు.

వినూత్నంగా ప్రచారం

సి పి ఎం అభ్యర్థి మూర్తి ఎన్నికల ప్రచారం వినూత్నంగా సాగింది. కొబ్బరి బొండాలు అమ్మే తోపుడు బండి వద్ద కు వెళ్ళిన ఆయన స్వయంగా కొబ్బరి బొండాం కొట్టారు. అరటి పండ్లు తో వెళ్ళే రిక్షా కార్మికుని వద్దకు వెళ్ళి రిక్షా బండి లాగి సుత్తి , కొడవలి, నక్షత్రం గుర్తు కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమం లో పార్టీ భీమిలి జోన్ సహాయ కార్యదర్శి ఎస్ అప్పల నాయుడు, నాయకులు ముద్దాడ రాము, వి నాగరాజు, ప్రజానాట్య మండలి కళాకారులు పంపా న సూర్య నారాయణ, పల్లా పోతురాజు, సి ఐ టి యు భీమిలి మండల అధ్యక్షులు నీలాతి రాము, నాయకులు, నమ్మి అప్పల నాయుడు, రీసు నరసింగరావు, శ్రీనివాస వర్మ, కానూ రి రమణ తది తరులు పాల్గొన్నారు.

పైడితల్లి సిరిమానోత్సవం 3 గంటలకే ప్రారంభం.. 5 గంటల్లోగా ముగింపు

విజయనగరం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 21:
శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవాన్ని ఈ నెల 27న మధ్యాహ్నం 3 గంటలకే ప్రారంభించి, సాయంత్రం 5 గంటల్లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తుఫాను హెచ్చరికలు, ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సంప్రదాయాలకు భంగం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. సిరిమానోత్సవం, ఎన్నికల నేపథ్యంలో అక్టోబర్ 27 నుంచి 30 వరకు మద్యం దుకాణాలు, బార్లు మూసివేయాలని ఆదేశించారు. ఈ ఏడాది సుమారు 3.5 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. భక్తుల భద్రత, రవాణా, తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.

మృతి చెందిన కుటుంబాలను పరామర్శించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

సిటిజన్ టైమ్స్ ధర్మపురి అక్టోబర్ 21
వెల్గటూరు మండలంలో కిషనరావు పేట గ్రామం లో ఇటీవల రోడ్డు ప్రమాదం లో మృతి చెందిన కొమురయ్య ,శ్రీనివాస్ కుటుంబలను సాంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పరామర్శించి సానుభూతి తెలిపారు. అనంతరం గుండె పోటుతో మృతి చెందిన మొకనపెల్లి చంద్రయ్య కుటుంబాన్ని పరామర్శించి,కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రభుత్వం తరుపున అన్ని విధాలా అండగా ఉంటామని కుటుంబాన్ని ఆదుకునేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సప్ప తిరుపతి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వైఎస్సార్ కాంగ్రెస్ అభ్యర్థులకు బి- ఫారాలు అందజేత

అమలాపురం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 21:
అమలాపురం మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా,వివిధ వార్డుల అభ్యర్థులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులకు బుధవారం అమలాపురం నియోజకవర్గ అసెంబ్లీ కో-ఆర్డినేటర్ డా. పినిపే శ్రీకాంత్ చేతుల మీదుగా బి-ఫారాలు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి,అమలాపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్, పీఏసీ సభ్యులు పినిపే విశ్వరూప్ మాట్లాడుతూ,రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ప్రజల మద్దతుతో అత్యధిక మెజారిటీ సాధించి ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, వంటెద్దు వెంకన్నాయుడు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

సమస్యాత్మక ప్రాంతాల్లో పటిష్ట భద్రతా చర్యలు

ఓటర్లను బెదిరించినా, అడ్డుకున్నా కఠిన చర్యలు

సిటిజన్ టైమ్స్, అనకాపల్లి, అక్టోబర్ 21
ఎన్నికల నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, జిల్లా స్థాయి అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి గత ఘటనలు, కేసుల ఆధారంగా పటిష్ట భద్రత కల్పించాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల ఓటర్లను బెదిరించినా, ఓటు హక్కు వినియోగించుకోకుండా అడ్డుకున్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, బెదిరించడం తీవ్రమైన నేరమని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకురాలు పూర్ణిమ దేవి పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పిస్తూ, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల సమాచారాన్ని సంబంధిత మొబైల్ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు పంపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, గ్రామ రెవెన్యూ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ రాజరాజేశ్వరి దేవిగా రెడ్డెమ్మ తల్లి

గుర్రంకొండ అక్టోబర్ 21సిటిజన్ టైమ్స్ :
అన్నమయ్య జిల్లా, గుర్రంకొండ మండలం ,చెర్లోపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ రెడ్డమ్మ దేవత దేవస్థానం నందు దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా చివరి రోజు శ్రీ అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు శ్రీ అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించి, పరిమళభరిత పుష్పాలతో శ్రీ అమ్మవారి ఉత్సవ మూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. తదుపరి సామూహిక కుంకుమార్చన నిర్వహించడమైనది. చెడుపై మంచి సాధించే విజయానికి ప్రతీకగా జరుపుకుని విజయదశమి నాడు శ్రీ అమ్మవారు రాజరాజేశ్వరీ దేవిగా దర్శనమిచ్చారు.. పూజలో పాల్గొన్న భక్తులందరికీ తీర్థప్రసాదాలు , తదుపరి అన్న ప్రసాదం వితరణ చేయడమైనది. రెడ్డి పరంజ్యోతి మోడీ వీరాంజనేయ ప్రసాద్ చిన్నమండెం వారు ఈరోజు ఉభయ దారులుగా వ్యవహరించారు . శ్రీ రెడ్డెమ్మ తల్లి ఆశీస్సులతో భక్తాదులందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని శ్రీ అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు ఆలయ చైర్మన్ లంకిపల్లి రాజన్న నాయుడు ,ఈఓ మంజుల తెలియజేశారు.

స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్ ఏర్పాట్ల పరిశీలన

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

జిల్లా ఎన్నికల అధికారిణి పి. ప్రశాంతి

రామచంద్రపురం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 21
రామచంద్రపురం మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారిణి పి. ప్రశాంతి, ఐఏఎస్ పరిశీలించారు. చింతపల్లి సూరిన్న నగర్‌లోని శ్రీ ఇందిరాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేస్తున్న ఎన్నికల స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్, రిసెప్షన్ సెంటర్, రిసీవింగ్ సెంటర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎలక్ట్రోలల్ అబ్జర్వర్ పి ప్రశాంతి మాట్లాడుతూ పాఠశాల ప్రాంగణంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లు, అడిగి తెలుసుకున్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, సీసీ కెమెరాల నిఘాను నిరంతరం కొనసాగించాలని, అనుమతి లేని వ్యక్తులు లోపలికి ప్రవేశించకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్. రాజు, టీపీఓ వి. శేషగిరి, డీఈ జి. శ్రీకాంత్, ఈఓ టి.వి. సూర్యనారాయణ, ఆర్డీఓ సరళాదేవి, అగ్రికల్చర్ అధికారి రమణ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు

భక్తుల నామస్మరణల మధ్య దుర్గమ్మ నిమజ్జనం.. వచ్చే ఏడాది మళ్లీ రావాలంటూ వీడ్కోలు

హుస్నాబాద్, అక్టోబర్ 21 (సిటిజన్ టైమ్స్):
దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో దుర్గామాత నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు విశేష పూజలు అందుకున్న జగన్మాత దుర్గాదేవికి చివరి రోజు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులు అమ్మవారికి ఘనంగా వీడ్కోలు పలికారు. "శరణం శరణం భవాని శరణం" అంటూ భక్తులు చేసిన నామస్మరణలు, జై దుర్గామాత నినాదాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఉత్సవాల్లో భాగంగా మండపాల వద్ద అమ్మవారికి సమర్పించిన వస్త్రాలు, పూజా సామగ్రి వేలంపాట కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు వేలంపాటలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, అమ్మవారికి హారతులు ఇస్తూ, భక్తిపాటలకు అనుగుణంగా సంప్రదాయ నృత్యాలు చేస్తూ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. "మళ్లీ సంవత్సరం రావమ్మా.. పోయిరావమ్మా జగన్మాతా.. మా తల్లి దుర్గమ్మా" అంటూ మహిళలు, భక్తులు భావోద్వేగంతో అమ్మవారికి వీడ్కోలు పలికారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారి సేవలో తరించిన భక్తులు, వచ్చే ఏడాది కూడా తమకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థించారు. భక్తుల జయజయధ్వానాలు, మహిళల హారతులు, సంప్రదాయ నృత్యాల నడుమ దుర్గామాత నిమజ్జన కార్యక్రమం ఘనంగా ముగిసింది. భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయాల సమ్మేళనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తులకు మధురమైన జ్ఞాపకాలను మిగిల్చాయి.

పోలీసు అమరవీరులకు ఘన నివాళి..

జాన్ విల్సన్ సేవలు చిరస్మరణీయం

సిటిజన్ టైమ్స్, హుస్నాబాద్, అక్టోబర్ 21:
పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో స్వర్గీయ సీఐ యాదగిరి, ఎస్సై జాన్ విల్సన్ చిత్రపటాలకు పోలీసు సిబ్బంది, మున్సిపల్ ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాన్ విల్సన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన సేవలను పలువురు కొనియాడారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని, అమరవీరుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు, కౌన్సిలర్లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి పల్లకి సేవ

పులివెందుల, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 21:
పులివెందుల పట్టణంలోని గుంత బజారు ప్రాంతంలో ఉన్న మిట్టమల్లే స్వామి ఆలయంలో బుధవారం అయ్యప్ప స్వామి పల్లకి సేవ భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాన్ని నూతనంగా తయారు చేయించిన ప్రత్యేక పల్లకిలో ఉంచి భక్తులు ఆలయం చుట్టూ ఊరేగింపు నిర్వహించారు. శ్రీపతి చిన్న బాలుడు కుమారుడు శ్రీపతి చక్రవర్తి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామివారికి నూతన పల్లకిని తయారు చేయించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సాయంత్రం పల్లకి సేవను ప్రారంభించారు. అయ్యప్ప భక్తులు పల్లకిని భుజాలపై మోస్తూ "స్వామియే శరణమయ్యప్ప" అంటూ భక్తి నినాదాలు చేస్తూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. దీంతో ఆలయ పరిసరాలు అయ్యప్ప నామస్మరణతో మార్మోగాయి. ఈ కార్యక్రమంలో భక్తులు భక్తిపారవశ్యంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. పల్లకి సేవకు హాజరైన భక్తులకు నిర్వాహకులు అల్పాహార భిక్ష ఏర్పాటు చేశారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పింది.

వైసీపీ మాజీ వైస్ ఎంపీపీ టిడిపిలో చేరిక...

కందువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...

కొత్తపేట సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 21
అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట గ్రామం పనసలదొడ్డి ఏరియాకు చెందిన వైసీపీ మాజీ వైస్ ఎంపీపీ దంగేటి వెంకట నాగమణి సుబ్రహ్మణ్యం వైసీపీ ని వీడి తన అనుచరులతో కలిసి 35 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు.వెంకట నాగమణి సుబ్రహ్మణ్యం కు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలుగుదేశం పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తన అనుచరులతో కలిసి సుబ్రహ్మణ్యం తెలుగుదేశం పార్టీలో చేరడంతో, స్థానిక ఎన్నికల వేల కొత్తపేట టీడీపీ లో కొత్త జోష్ వచ్చింది. ఎమ్మెల్యే సత్యానందరావు నాయకత్వంలో ఆయన ఆదేశాల మేరకు పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని సుబ్రహ్మణ్యం తెలిపారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థుల గెలుపు కోసం పూర్తి స్థాయిలో కృషి చేస్తానని దంగేటి సుబ్రహ్మణ్యం తెలిపారు.

గుర్రంకొండ ఎంపీటీసీ-2 టీడీపీ అభ్యర్థిగా నాయిని జగదీష్ నామినేషన్ దాఖలు

గుర్రంకొండ అక్టోబర్ 21 సిటిజన్ టైమ్స్
స్థానిక సంస్థల ఎన్నికల పర్వం ప్రారంభమైన నేపథ్యంలో, గుర్రంకొండ మండలం ఎంపీటీసీ-2 స్థానానికి తెలుగుదేశం పార్టీ అధికారిక అభ్యర్థిగా పార్టీ మండల అధ్యక్షుడు నాయిని జగదీష్ కుమార్ ఘనంగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, అనుచరులు, భారీ సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలతో కలిసి ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను అందజేశారు.నామినేషన్ దాఖలుకు ముందు గుర్రంకొండలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ ప్రదర్శన నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జెండాలు పట్టుకుని నాయకులు, శ్రేణులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'జై తెలుగుదేశం' నినాదాలతో గుర్రంకొండ పరిసరాలు మారుమోగాయి.నామినేషన్ అనంతరం నాయిని జగదీష్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వ ప్రజాక్షేమ పాలన, నియోజకవర్గ నేతల సహకారంతో గుర్రంకొండ ఎంపీటీసీ-2 స్థానంలో అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సమస్యల పరిష్కారానికి, మండల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గుర్రంకొండ మండల పరిధిలోని టీడీపీ మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, క్లస్టర్ మరియు యూనిట్ ఇంచార్జ్‌లు, వివిధ కమిటీల సభ్యులు, నల్లారి అభిమానులు మరియు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని జగదీష్ కుమార్‌కు మద్దతు పలికారు.

అంగరంగ వైభవంగా అమ్మవారి ఊరేగింపు తండోపతండాలుగా భక్తులు

-ముఖ్య అతిథులుగా ఎంపీ రఘునందన్ రావు



జిన్నారం మండలం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 21
జిన్నారం మండల కేంద్రంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు అయినా ఈరోజు అమ్మవారి ఊరేగింపు నిమజ్జన కార్యక్రమం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది ముందుగా అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో వివిధ అలంకారాలతో నాట్యాలు చేస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు తండోప తండాలుగా ప్రజలు అమ్మవారి ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ రఘునందన్ రావు మాజీ జెడ్పిటిసి ప్రభాకర్ మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి బిజెపి మండల అధ్యక్షులు కొత్త కాపు జగన్ రెడ్డి బిజెపి సీనియర్ నాయకులు రాజేందర్ రెడ్డి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ హిందూ సంప్రదాయాలు హిందూ ధర్మాన్ని కాపాడుతున్న యువతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఉత్సవ కమిటీ సభ్యులు ఎంతో భక్తిశ్రద్ధలతో నవరాత్రులు అమ్మవారిని పూజించి ఊరేగింపు కార్యక్రమం ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహించిన ఉత్సవ కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు హిందూ ధర్మం ఇంకా బతికి ఉంది అనేదానికి నిదర్శనం మన హిందూ పండుగలని ఆయన అన్నారు ప్రతి ఒక్కరూ హిందూ సంప్రదాయాలను హిందూ దేవతలను పూజించాలని మన హిందుత్వాన్ని బతికించాలని ఆయన యువకులకు పిలుపునిచ్చారు ఎంతో అంగరంగ వైభవంగా వివిధ అలంకారాలతో నృత్యాలు సాంస్కృతి కార్యక్రమాలు తండోపతండాలుగా ప్రజలు అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆయన అన్నారు ముఖ్య అతిథులు ఎంపీ రఘునాథరావు పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని జిన్నారం మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి అన్నారు జిన్నారం గ్రామం అంతా అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని ఆయన అన్నారు ముఖ్య అతిథులకు ఘనంగా సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు అమ్మవారి నవరాత్రులు చీరలు వేలం పాట ద్వారా భక్తిశ్రద్ధలతో ప్రజలు అందుకోవడం జరిగింది నృత్యాలు అంగరంగ వైభవంగా లైటింగ్స్ తో అమ్మవారిని ఊరేగించి నిమజ్జన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఉత్సవ కమిటీ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు గ్రామస్తులకు అందరికీ ఉండాలని ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలందరికీ కృప కటాక్షం ఆశీస్సులు ఉండాలని వారు అన్నారు ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున గ్రామస్తులు యువకులు గ్రామ పెద్దలు నాయకులు యువజన సంఘాలు హిందూ సంఘాలు భారీ ఎత్తున పాల్గొనడం జరిగింది.

సోమందేపల్లి మండల జడ్పీటీసీ అభ్యర్థిగా జయంతి ఖరారు!

టీడీపీ తరపున మాజీ కన్వీనర్ సిద్దలింగప్ప భార్యకు అవకాశం.. ఎన్నికల బరిలో మహిళా అభ్యర్థి

సోమందేపల్లి, అక్టోబర్ 21 (సిటిజన్ టైమ్స్):
శ్రీ సత్యసాయి జిల్లా, పెనుకొండ నియోజకవర్గంలోని సోమందేపల్లి మండల జడ్పీటీసీ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ మాజీ కన్వీనర్ సిద్దలింగప్ప భార్య జయంతిని పార్టీ ఎంపిక చేసింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా పార్టీ అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

టీడీపీ అభ్యర్థిగా జయంతికి అవకాశం
సోమందేపల్లి మండలంలో జడ్పీటీసీ స్థానానికి టీడీపీ తరపున జయంతి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడంతో పార్టీ శ్రేణుల్లో ఎన్నికల సందడి నెలకొంది. మాజీ కన్వీనర్ సిద్దలింగప్ప కుటుంబానికి పార్టీ అవకాశం కల్పించడంతో జడ్పీటీసీ ఎన్నికలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

మండల అభివృద్ధికి కృషి చేస్తా: జయంతి
జడ్పీటీసీ అభ్యర్థిగా ఎంపికైన సందర్భంగా జయంతి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో అభ్యర్థిగా అవకాశం కల్పించిన పార్టీ నాయకత్వానికి

కృతజ్ఞతలు తెలిపారు. సోమందేపల్లి మండల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ప్రజల ఆదరణతో ఎన్నికల్లో విజయం సాధించి మండల అభివృద్ధికి మరింత కృషి చేయడమే తన లక్ష్యమని సోమందేపల్లి మండల ప్రజలు అత్యంత మెజార్టీతో గెలిపించాలని ఆమె తెలిపారు.

పటాన్‌చెరులో అంగరంగ వైభవంగా దసరా వేడుకలు

-మహిషాసుర దహన కార్యక్రమంలో పాల్గొన్న పృథ్వీరాజ్

పటాన్చెరు సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 21
పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అధ్యక్షతన, శ్రీ మహంకాళి సేవా సమితి ఆధ్వర్యంలో మైత్రి క్రీడా మైదానంలో నిర్వహించిన మహిషాసుర దహన కార్యక్రమంలో మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. పటాన్చెరు జిహెచ్ఎంసి కార్యాలయం బుద్ధ విగ్రహం వద్ద ధ్వజపతాక ఆవిష్కరణ, కొత్త మార్కెట్ వద్ద షమీ పూజ నిర్వహించారు. ఈ వేడుకల్లో పటాన్‌చెరు పట్టణ ప్రముఖులు, పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో మైత్రి క్రీడా మైదానం జనసంద్రంగా మారింది.ఈ సందర్భంగా పటాన్‌చెరు పెద్దలు తరతరాలుగా కొనసాగిస్తున్న ఆచార సంప్రదాయాలను గౌరవిస్తూ, వాటిని భవిష్యత్ తరాలు కూడా పాటించేలా ముందుకు తీసుకెళ్తామని, మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు వారసత్వంగా అందిస్తామని మాద్రి పృథ్వీరాజ్ తెలిపారు.

ఎన్నికల వేళ అప్రమత్తత.. పోలీసుల పహారాలో సోమందేపల్లి!

పటిష్ట బందోబస్తుతో శాంతిభద్రతల పరిరక్షణ

144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30 అమలు ఎస్ఐ సుధాకర్ యాదవ్‌కు ప్రజల అభినందనలు

సోమందేపల్లి, అక్టోబర్ 21 (సిటిజన్ టైమ్స్)
స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల నేపథ్యంలో సోమందేపల్లి మండల కేంద్రంలో పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

తహసీల్దార్ మారుతి, ఎస్ఐ సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తును కట్టుదిట్టం చేశారు. మండల పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఇందులో భాగంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కార్యాలయం, వైఎస్సార్ సర్కిల్, ప్రభుత్వ పాఠశాల పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30 అమలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించవద్దని, అనవసరంగా గుంపులుగా గుమిగూడరాదని అధికారులు సూచిస్తున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

మండలవ్యాప్తంగా ముందస్తు చర్యలు.. ప్రజల హర్షం!
సోమందేపల్లి పట్టణంతో పాటు మండలంలోని అన్ని ప్రాంతాల్లోనూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు తీసుకుంటున్న ముందస్తు చర్యలపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఎక్కడా చిన్నపాటి అవాంఛనీయ ఘటన కూడా చోటుచేసుకోకుండా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తుండటంపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రజలకు భద్రత కల్పిస్తూ, ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటున్న ఎస్ఐ సుధాకర్ యాదవ్‌కు సోమందేపల్లి మండల ప్రజలు అభినందనలు తెలియజేస్తున్నారు. ఇదే అప్రమత్తతతో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు శాంతిభద్రతలను కాపాడాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

ఓల్డేజ్ హోంలో వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు

అమలాపురం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 21
బండారులంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఈదరపల్లి గ్రామంలో ఉన్న ఓల్డేజ్ హోమ్‌లో నివసిస్తున్న వృద్ధులకు వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వృద్ధుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. వృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, వారికి అవసరమైన వైద్య సేవలను అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్బీఎస్కే నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుమలత పర్యవేక్షన్ల లో డా.గౌతమీ,డా.అమృత, డిఐసిఇ సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సర్వసన్నద్ధం...

-జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్.

అమలాపురం, సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 21

జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని వివేకనంద సమావేశం మందిరంలో మున్సిపాలిటీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల సన్నద్ధతపై జిల్లా జాయింట్ కలెక్టర్‌తో కలిసి జిల్లా స్థాయి అధికారులు, నోడల్ అధికారులు, వివిధ శాఖల అధిపతులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల పర్యవేక్షణ బాధ్యతలను మున్సిపల్ కమిషనర్లకు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల బాధ్యతలను జిల్లా పరిషత్ సీఈఓకు, గ్రామ పంచాయతీ ఎన్నికల బాధ్యతలను జిల్లా పంచాయతీ అధికారికి అప్పగించారు. మిగిలిన విభాగాలకు జిల్లా స్థాయి అధికారులను నోడల్ అధికారులుగా నియమించారు.

ఓటర్ల జాబితాలపై దృష్టి:

గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితాల ప్రచురణ పూర్తయిందని అధికారులు తెలిపారు. జిల్లా పరిషత్‌కు అవసరమైన 20 ఎలక్టోరల్ రోల్ ప్రతుల్లో ఇప్పటికే 10 ప్రతులు అందజేయగా, మిగిలిన ప్రతులను సీఈఓ జెడ్పీకి అందజేయాలని నిర్ణయించారు. మున్సిపాలిటీల్లో సప్లిమెంటరీ ఓటర్ల జాబితాల రూపకల్పన, ముద్రణ, రాజకీయ పార్టీలకు పంపిణీ ప్రక్రియలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. లిపోలింగ్ సిబ్బందికి శిక్షణ:లి పోలింగ్ సిబ్బంది నియామకం, ర్యాండమైజేషన్ ప్రక్రియలను వేగవంతం చేయాలని సూచించారు. సిబ్బంది కొరతను అధిగమించేందుకు నిబంధనల మేరకు అదనపు సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని, మైక్రో అబ్జర్వర్ల నియామకంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పీఓలు, ఏపీఓలు, ఇతర పోలింగ్ సిబ్బందికి మొదటి, రెండో విడత శిక్షణను నిర్ణీత

షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం అమలాపురంలో 8, ముమ్మిడివరంలో 6, రామచంద్రపురంలో 6 టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఎంపీటీసీ విభాగాలకు అనుగుణంగా కౌంటింగ్ టేబుళ్లు, సిబ్బంది కేటాయింపులను త్వరితగతిన ఖరారు చేయాలని కలెక్టర్ సూచించారు. రామచంద్రపురం మున్సిపాలిటీలోని 50 పోలింగ్ స్టేషన్లలో 15 సెన్సిటివ్, 16 హైపర్ సెన్సిటివ్ కేంద్రాలుగా గుర్తించారు. అమలాపురంలోని 71 పోలింగ్ స్టేషన్లలో 18 సెన్సిటివ్, 18 హైపర్ సెన్సిటివ్ కేంద్రాలుగా, ముమ్మిడివరంలోని 23 పోలింగ్ స్టేషన్లలో 7 సెన్సిటివ్ కేంద్రాలుగా గుర్తించినట్లు తెలిపారు. ఆయా కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు.

రవాణా, భద్రతా ఏర్పాట్లు:

బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సిబ్బంది తరలింపునకు అవసరమైన వాహనాలను సమకూర్చాలని జిల్లా రవాణా అధికారికి సూచించారు. స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలు, బారికేడింగ్ పనులను సంబంధిత ఇంజనీరింగ్ శాఖలు సమన్వయంతో పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తపేట, రామచంద్రపురం, అమలాపురంలోని ఎస్‌కేబీఆర్ కళాశాలల్లో ఏర్పాట్లను పరిశీలించి, నిబంధనల ప్రకారం అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలుపై నిఘా ఉందని, జిల్లావ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, వ్యయ పర్యవేక్షణ కోసం 66 ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు పనిచేస్తున్నాయని అధికారులు వివరించారు. ఎన్నికల ఉల్లంఘనలపై నిరంతర నిఘా కొనసాగించాలని, అభ్యర్థుల ఎన్నికల ఖర్చులను నిబంధనల ప్రకారం నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ఫిర్యాదుల పరిష్కారానికి కంట్రోల్ రూములు, ఓటర్ హెల్ప్‌లైన్ విభాగాలను క్రియాశీలంగా ఉంచాలని, మీడియా సమాచార మార్పిడి కోసం ప్రత్యేక మీడియా కేంద్రాన్ని నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి అధికారి తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా పరిపాలన అధికారి కే. నాగలక్ష్మమ్మ, జిల్లా పంచాయతీ అధికారిణి శాంతి కుమారి, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ కేశవ వర్మ, ఆర్ అండ్ బి ఈఈ బి.రాము, డిఎంహెచ్వో ఎం. దుర్గా రావు దొర, డిఆర్డి ఎ పిడి డి.రాంబాబు, సంబంధిత జిల్లా అధికారులు కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన చంద్రశేఖర్

పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు

సోమందేపల్లి, అక్టోబర్ 21 (సిటిజన్ టైమ్స్):

సోమందేపల్లి మండల ఎంపీపీ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ తరపున నీరుగంటి చంద్రశేఖర్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ ఆశీస్సులతో నామినేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా తనకు అండగా నిలిచి, ప్రోత్సహించిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోమందేపల్లి మండల ప్రజలు, స్నేహితులు, బంధుమిత్రులందరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై చూపుతున్న ప్రేమాభిమానాలు, ఆదరణ, ఆశీస్సులు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని గౌరవిస్తూ, సోమందేపల్లి మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రజల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. ప్రజల ఆశీస్సులే తన బలమని, ప్రజాసేవే తన లక్ష్యమని నీరుగంటి చంద్రశేఖర్ పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ప్రజల సహకారం, ఆదరణ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు.

వైఎస్ఆర్సిపి ఎంపీటీసీ సభ్యుల నామినేషన్ దాఖలు

అయినవిల్లి సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 21

మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీటీసీ సభ్యులుగా పలువురు నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్లు దాఖలు చేశారు.

పోతుకుర్రు- కొండుకుదురు గ్రామాలు ఎంపీటీసీ సభ్యునిగా మేడిది వి.సత్యనారాయణమూర్తి నామినేషన్ దాఖలు చేశారు. కె. జగన్నాథపురం గ్రామం ఎంపీటీసీ సభ్యునిగా నూకపెయ్యి మీరా సాహెబ్ నామినేషన్ దాఖలు చేశారు.తొత్తరమూడి--1 గ్రామం ఎంపీటీసీ సభ్యునిగా నామినేషన్ దాఖలు చేసిన రాయుడు శ్రీనివాసరావు నామినేషన్ దాఖలు చేశారు. నల్లచెరువు-ఎన్.పెదపాలెం గ్రామాలు ఎంపీటీసీ సభ్యురాలిగా మద్దా దుర్గాబాయి నామినేషన్ దాఖలు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులందరికీ పి. గన్నవరం వైఎస్ఆర్సిపి కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

జిల్లాలో తొలి రోజు జెడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ..

కాకినాడ జిల్లా ప్రజా పరిషత్తు కార్యాలయంలో జెడ్పీటీసీ స్థానాలకు నామినేషన్ల స్వీకరించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్..

కాకినాడ సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 21

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా జిల్లా ప్రాదేశిక నియోజకవర్గం (జెడ్పీటీసీ), మండల ప్రాదేశిక(ఎంపీటీసీ) స్థానాలకు బుధవారం నుంచి నామినేషన్ల ఘట్టం ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలో తొలి రోజు ఉదయం 10:30 నిమిషాల నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించి కాకినాడ జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి మరియుజాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్.. వివిధ పార్టీల అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరించారు. జెడ్పీటీసీ స్థానాలకు గణేష్ రాజా రావుల,జగ్గంపేట మండలం(వైఎస్సార్ సీపీ) - 2 సెట్లు,సురేష్ కుమార్ రావుల, జగ్గంపేట మండలం(వైఎస్సార్ సీపీ)- 2 సెట్లు,పితాని ధనలక్ష్మి, కాకినాడ రూరల్ మండలం (జనసేనా); డాకారపు ఎలిజిబెత్ జయప్రద, కాజులూరు మండలం (వైఎస్సార్ సీపీ), గొల్లు శారద, రౌతులపూడి మండలం(వైఎస్సార్ సీపీ), గొల్లు ఉమాదేవి, రౌతులపూడి మండలం (వైఎస్సార్ సీపీ), పోలినాటి పద్మ, కాజులూరు మండలం(వైఎస్సార్ సీపీ); గుర్రాల అప్పారావు తుని మండలం(కాంగ్రెస్), వమ్మి వీరలక్ష్మి, గొల్లప్రోలు మండలం(వైఎస్సార్

సీపీ), పాఠం శెట్టి వెంకట శ్రీదేవి, కిర్లంపూడి మండలం (వైఎస్సార్ సీపీ),పాఠం శెట్టి సూర్యచంద్ర, కిర్లంపూడి మండలం (స్వతంత్ర అభ్యర్థి) మొత్తం- 11 మంది అభ్యర్థులు నిమినేషన్లు దాఖలు చేశారు. జిల్లాలోని 20 మండల కేంద్రాల్లో వివిధ పార్టీలకు సంబంధించిన మొత్తం-200 మంది అభ్యర్థులు బుధవారం ఎంపీటీసీలుగా నామినేషన్లు దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో డి.శ్రీలలిత ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరులకు ఘన నివాళులు

అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది - జిల్లా ఎస్పీ రాహుల్ మీనా

అమలాపురం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 21 :

పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా అంబేద్కర్ కోనసీమ జిల్లా,అమలాపురం పోలీస్ గ్రౌండ్ నందు అమరవీరుల స్థూపం వద్ద బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, తో కలిసి అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులర్పించారు. తొలుత పెరేడ్ కమాండర్ ఆర్ఐ యన్.బ్రహ్మానందం ముఖ్య అతిథులకు గౌరవ వందనం సమర్పించి స్వాగతం పలికారు. అనంతరం దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో అమరులైన పోలీస్ సిబ్బంది వివరాలతో కూడిన సంస్మరణ పుస్తకాన్ని పుస్తక్ తొలి కమాండింగ్ తో తీసుకువచ్చి కలెక్టర్ కి అందజేయగా ఆ పుస్తకాన్ని ఎస్పీ తో కలిసి ఆవిష్కరించారు.

జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించి అమరులైన పోలీసు వీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ వద్ద చైనా దళాల దాడిని ఎదుర్కొంటూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ సిబ్బంది త్యాగానికి గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు, త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని, వారి త్యాగాలు పోలీసు సిబ్బందితో పాటు భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని, ప్రజల రక్షణ కోసం నిరంతరం విధులు నిర్వహిస్తూ పోలీసులు అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని తెలిపారు. అనంతరం అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) శ్రీ మహేంద్ర మత్తే అమరవీరుల పేర్లతో కూడిన రోల్ ఆఫ్ హానర్ ను చదివి వినిపించారు.ఈ ఏడాది దేశ వ్యాప్తంగా 154 మంది పోలీసులు వివిధ ఆపరేషన్స్ లో ప్రాణత్యాగం చేసి అమరులైనట్లు, వారిలో ఒకరు మన ఆంధ్రప్రదేశ్ నుండి ఒకరు ఉన్నారని పేర్కొన్నారు. అమరవీరులకు గౌరవ సూచకంగా అందరూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.తదుపరి అధికారులు,ఆహ్వానితులు, అమరవీరుల కుటుంబ సభ్యులు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా లో ఏడాది కాలంలో విధినిర్వహణలో అమరులైన రెండు పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు అందచేశారు. వారి కుటుంబ యోగక్షేమాలను జిల్లా ఎస్.పి అడిగి తెలుసుకున్నారు.ఎప్పుడు ఎలాంటి సమస్య ఎదురైనా అండగా ఉంటామని, ఎప్పుడైనా తమను సంప్రదించవచ్చన్నారు. అనంతరం జిల్లా లో గత సంవత్సరం అమరవీరుల కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు అందజేసి, వారితో ఆత్మీయంగా మాట్లాడి పండ్లు అందించారు. అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తామని జిల్లా ఎస్పీ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమలాపురం సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ టి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ షేక్ షాభాజ్ అహ్మద్,ఏఆర్ డీఎస్పీ జి.యు.కె.ఎల్.వి. సుబ్బరాజు,ఎస్బీ సీఐ పుల్లారావు ,సోషల్ మీడియా సిఐ తమ్మి నాయుడు,రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ల బ్రహ్మానందం, సబ్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు ,ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

కొండపోచమ్మ గుట్టపై భక్తుల సౌకర్యార్థం సిమెంట్ కుర్చీల ఏర్పాటు

రాళ్లకత్వలో సాయి గౌడ్ సేవాభావం

జిన్నారం సిటిజన్ టైమ్స్ అక్టోబర్20:

సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గంలోని జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని రాళ్లకత్వ గ్రామంలో కొండపోచమ్మ గుట్టపై భక్తుల సౌకర్యార్థం గుమ్మడిదల సాయి గౌడ్ తన సొంత నిధులతో రెండు సిమెంట్ కుర్చీలను ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు కూర్చోవడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న ఆయన, సుమారు రూ.10 వేల సొంత ఖర్చుతో ఆలయం సమీపంలో కుర్చీలను ఏర్పాటు చేయించారు. భక్తుల సౌకర్యార్థం తన వంతుగా సేవ చేయడం ఎంతో ఆనందంగా ఉందని సాయి గౌడ్ తెలిపారు. భవిష్యత్తులోనూ కొండపోచమ్మ గుట్ట అభివృద్ధికి తన వంతు కృషి చేస్తాననీ పేర్కొన్నారు. కొండపోచమ్మ అమ్మవారి కృపాకటాక్షాలు తెలంగాణ ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు. భక్తుల ఇబ్బందులను గుర్తించి సొంత నిధులతో కుర్చీలు ఏర్పాటు చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు కార్యక్రమంలో రాయిని మహేష్, రాయని సతీష్ , శ్రీశైలం, పోచయ్య, పాండు, వీరేష్, వీరేష్, నాగరాజు, బాలేష్, చిరంజీవి, అమీర్, మహేష్, శ్రీశైలం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జిఎంఆర్ కు దసరా శుభాకాంక్షలు

-తెలియజేసిన గుమ్మడిదల నాయకులు

పటాన్చెరు సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 21

దసరా పండుగను పురస్కరించుకొని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి నీ గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి వార్డు కౌన్సిలర్లు పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి పుష్ప గుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ ఎల్లప్పుడూ ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తానని తన వంతు సహాయ సహకారాలు కూడా అందజేస్తానని అన్నారు విజయదశమి సందర్భంగా ప్రజలంతా సుఖ సంతోషాలతో వెలుగొందాలని అందరికీ అమ్మవారి దయ ఉండాలని ఆయన కోరుకున్నారు నాకు శుభాకాంక్షలు తెలియజేసిన గుమ్మడిదల నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీని వీడి సొంతగూటికి ముదునూరి సత్యనారాయణరాజు...

పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...

ఆత్రేయపురం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 21

మండలం తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు, తాడిపూడి మాజీ సర్పంచ్ ముదునూరి సత్యనారాయణ రాజు, తాడిపూడి మాజీ ఉపసర్పంచ్ సకినేటి రామకృష్ణ రాజు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి బుధవారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు రావులపాలెంలో వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం ద్వారా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో, గ్రామంలో చేస్తున్న అభివృద్ధి కొనసాగడం ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందని ఈ సందర్భంగా ముదునూరి సత్యనారాయణ రాజు, సకినేటి రామకృష్ణ రాజు వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కొత్తపేట నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు నభూతో న భవిష్యత్తు అని వారు కొనియాడారు. కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని వారికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించారు.

ఎన్నికలంటే వైసీపీకి భయం.. న్యాయపోరాటాలతో అడ్డంకులు!

ఎన్నికలను అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపణ

అభివృద్ధికి ఆటంకాలు సృష్టిస్తున్నారని విమర్శ

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

అమరావతి, అక్టోబర్ 21 (సిటిజన్ టైమ్స్):
ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం లేకే వైసీపీ న్యాయపరమైన వివాదాలతో ఎన్నికల ప్రక్రియకు అడ్డంకులు సృష్టిస్తోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విమర్శించారు. స్థానిక ఎన్నికల వేళ ఉద్రిక్తతలు సృష్టిస్తూ, న్యాయస్థానాలను ఆశ్రయించడం ద్వారా ఎన్నికలను నిలిపివేయాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లు, ఎస్ఐఆర్ తదితర అంశాలపై పిటిషన్లు దాఖలు చేసి ఎన్నికల ప్రక్రియకు ఆటంకాలు కలిగిస్తున్నారని పేర్కొన్నారు. అమరావతి, పోలవరం సహా రాష్ట్రాభివృద్ధి కార్యక్రమాలకు కూడా వైసీపీ అడ్డంకులు సృష్టిస్తోందని విమర్శించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కోవాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగాలని, ప్రజల తీర్పే అంతిమమని స్పష్టం చేశారు.

జిల్లా వైసీపీ జెడ్పీ చైర్మన్ అభ్యర్థిగా చింతా అనురాధ

కే.గంగవరం మండలం నుంచి జెడ్పీటీసీగా పోటీ చేయనున్న చింతా అనురాధ

కే. గంగవరం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 21
అంబేద్కర్ కోనసీమ జిల్లా జెడ్పీ చైర్మన్ అభ్యర్థిగా అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ ని ,వైయస్ఆర్సీపీ అధిష్ఠానం ఖరారు చేసింది. రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలోని కే.గంగవరం మండలం నుంచి ఆమె జెడ్పీటీసీగా పోటీ చేయనున్నట్లు పార్టీ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు మాజీ మంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ అధ్యక్షతన కే.గంగవరంలో నిర్వహించిన వైయస్ఆర్సీపీ సమావేశంలో చింతా అనురాధ అభ్యర్థిత్వాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ముక్తకంఠంతో చింతా అనురాధ ని గెలిపించుకుని, అంబేద్కర్ కోనసీమ జిల్లా జెడ్పీ పీఠంపై ఆమెను కూర్చోబెట్టి, వైయస్ఆర్సీపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం అసెంబ్లీ కో-ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షులు జున్నూరి రామారావు(బాబీ) , వైయస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేసిన టిడిపి ఎంపీటీసీ అభ్యర్థులు

పొన్నలూరు, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 21:
స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పొన్నలూరు మండలంలో నామినేషన్ల ప్రక్రియ మొదలయ్యింది. మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి బుధవారం కూటమి బలపరిచిన పది మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. తెలుగుదేశం పార్టీ తరఫున పొన్నలూరు ఎంపీపీ అభ్యర్థిగా అనుమోలు సరస్వతి ఇతర ఎంపీటీసీ అభ్యర్థులతో కలిసి ర్యాలీగా నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి. నాగమణికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. నామినేషన్ల ప్రక్రియను పర్యవేక్షించేందుకు డీఎస్పీ బాలసుబ్రమణ్యం కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి ఏర్పాట్లను పరిశీలించి, ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలను తీసుకోవాలని సూచించారు.

నాలుగు గ్రామాల ఏకాభిప్రాయం..

పందిపర్తి శ్రీనివాస్ రెడ్డి ఎంపిక!

రేపు నామినేషన్ దాఖలు చేయనున్న శ్రీనివాస్ రెడ్డి మన గ్రామాల అభివృద్ధే

నా లక్ష్యం ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటా: శ్రీనివాస్ రెడ్డి

సోమందేపల్లి, అక్టోబర్ 21 (సిటిజన్ టైమ్స్)
సోమందేపల్లి మండలంలో తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ అభ్యర్థిగా పందిపర్తి గ్రామానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి ఎంపికయ్యారు. రాష్ట్ర మంత్రి సవితమ్మ ఆదేశాల మేరకు పందిపర్తి, మంచేపల్లి, బ్రాహ్మణపల్లి, ఇబ్రహీంపల్లి గ్రామాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పరస్పరం చర్చించుకుని, అందరి ఏకాభిప్రాయంతో శ్రీనివాస్ రెడ్డిని ఎంపీటీసీ అభ్యర్థిగా ఎంపిక చేశారు.

నాలుగు గ్రామాల నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా తీసుకున్న ఈ నిర్ణయం పార్టీ ఐక్యతకు, క్రమశిక్షణకు నిదర్శనంగా నిలిచింది. పార్టీ అభ్యర్థి విజయానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని, గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని పార్టీ శ్రేణులు ఆకాంక్షించాయి.

రేపు నామినేషన్ దాఖలు
ఈ నెల 22వ తేదీ గురువారం శ్రీనివాస్ రెడ్డి ఎంపీటీసీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనను తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ అభ్యర్థిగా ఎంపిక చేసిన పార్టీ పెద్దలకు, సహకరించిన నాలుగు గ్రామాల నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నందున ప్రభుత్వ సహకారంతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన ప్రధాన లక్ష్యమని, గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరినీ కలుపుకొని ముందుకు సాగుతానని శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ తనను ఆశీర్వదించి, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన వినమ్రంగా విజ్ఞప్తి చేశారు. మన ఐక్యతే మన బలం.. మన గ్రామాల అభివృద్ధే మన లక్ష్యం అనే నినాదంతో ముందుకు సాగుతామని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు.

ఇంటింటా టీడీపీ ప్రచారం..

మున్సిపాలిటీ కైవసంపై కూటమి ధీమా!

పులివెందుల, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 21:
పులివెందుల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కూటమి అభ్యర్థి గీత కుమారి తరఫున టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ప్రచారంలో భాగంగా రెండో రోజు లక్ష్మీదేవి ఆలయంలో లక్ష్మీ అమ్మవారికి, గుంత బజారులోని శివాలయంలో పరమశివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. కూటమి అభ్యర్థి గీత కుమారి తరఫున ఆమె భర్త తూగుట్ల మధుసూదన్ రెడ్డి, కుమార్తె సాయి సంధ్య, అక్క కరుణాదేవి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటూ, కూటమి అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరారు.

మౌలిక వసతుల కల్పనకు హామీ
పులివెందుల మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించడమే తమ లక్ష్యమని ప్రచార బృందం పేర్కొంది. ముఖ్యంగా రహదారుల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు, భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ, ఇళ్లకు సంబంధించిన అనుమతుల సమస్యల పరిష్కారం, ప్రతి ఇంటికీ పార్నపల్లి తాగునీటిని అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.

మున్సిపాలిటీపై కూటమి నేతల ధీమా..: పులివెందుల మున్సిపాలిటీలో మొత్తం 40 వార్డులు ఉండగా, ఇప్పటికే 20 వార్డులు ఏకగ్రీవమైనట్లు ప్రచార బృందం పేర్కొంది. మిగిలిన వార్డుల్లోనూ విజయం సాధించి మున్సిపాలిటీని కూటమి కైవసం చేసుకుంటుందని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఇంటింటి ప్రచారానికి ప్రజల నుంచి సానుకూల స్పందన లభిస్తోందని వారు తెలిపారు. మున్సిపాలిటీలో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా ముందుకు సాగుతున్నామని ప్రచార బృందం వెల్లడించింది.

ఎన్నికల విధుల పై సిబ్బందికి సంపూర్ణ అవగాహన అవసరం

- జిల్లా ఎన్నికల పరిశీలకు రాలు కే హెప్సీబా రాణి

ఒంగోలు, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 21:
ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బందికి సంబంధిత అంశాలపై సంపూర్ణ అవగాహన ఉండాలని జిల్లా ఎన్నికల పరిశీలకురాలు కె. హెప్సిబా రాణి చెప్పారు. ఆర్.వో.లు, ఏ.ఆర్.వో.లు, ఈ.ఓ.లు, ఏ.ఈ.ఓ.లకు మంగళవారం ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఎన్నికల వ్యయ పరిశీలకులు వివేక్ లతో కలిసి ఆమె పాల్గొన్నారు. పోలింగ్ ఏజెంట్లు, పోస్టల్ బ్యాలెట్లు, ఎన్నికల ప్రవర్తన నియమావళి, పోలింగ్ కేంద్రంలోకి అనుమతి, ఎఫ్.ఎస్.టి, ఎస్.ఎస్.టి, వి వి టి. బృందాల పనితీరు, తనిఖీల సమయంలో అనుమానాస్పద నగదు, వస్తువులను స్వాధీనం చేసుకునే సమయంలో అనుసరించాల్సిన విధానం, తదితర అంశాలపై ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమాల నోడల్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరరావు అవగాహన కల్పించారు. హెప్సిబా రాణి మాట్లాడుతూ ఎన్నికల విధులలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అదే సమయంలో సాధారణ ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. వివాహ, వైద్య ఖర్చులకోసం నగదుతో వెళ్తున్న వారు తగిన ఆధారాలు సమర్పిస్తే నిబంధనల మేరకు అనుతించాల్సి ఉంటుందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ పూర్తిగా ముగిసే నెలన్నర రోజులపాటు సిబ్బంది అందరూ తమకు కేటాయించిన విధులలో ఉండాలని ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘ నిబంధనల మేరకు పంపించాల్సిన నివేదికలను సకాలంలో సమర్పించాలని ఆదేశించారు. ఎన్నికలు స్వేచ్ఛగా సజావుగా ప్రశాంత వాతావరణంలో జరిగేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందన్నారు. ఈ దిశగా నియమించిన నోడల్ అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కాగా, ఆయా విషయాలపై శిక్షణ అనంతరం ఇందులో పాల్గొన్న వారి అవగాహన తెలుసుకునేందుకు ఎన్నికల పరిశీలకుల సూచన మేరకు పరీక్ష నిర్వహించారు. అనంతరం సిబ్బంది అనుమానాలను అధికారులు నివృత్తి చేశారు.

వాసవి అమ్మవారి నగరోత్సవం

వార్లు పోసి కాయా కర్పూరం సమర్పించి మ్రొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



గిద్దలూరు, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 21:
గిద్దలూరులో వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో గత పది రోజులుగా దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. చివరి రోజైన బుధవారం నాడు అమ్మవారు విజయలక్ష్మి అలంకారంలో గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. అలంకరించిన రథం పై అమ్మవారిని ప్రతిష్టించి గ్రామోత్సవం నిర్వహించారు. కేరళ వాయిద్యాలు, బాజా భజంత్రీల, టపాసుల మోతల్తో నగరోత్సవం అంగరంగ వైభవంగా సాగుతోంది ,వీధుల్లో భక్తులు వార్లు పోసి కాయ కర్పూరం సమర్పించి మ్రొక్కులు చెల్లించు కుంటున్నారు .ఈసందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటంబృందాలు ఏర్పాటు చేశారు. వాసవి మాత గ్రామోత్సవం గురువారం ఉదయానికి కోవెలకు చెరుకోనుంది , అంతరం వసంతోత్సవం నిర్వహిస్తారు అంతకుమునుపు గ్రామాల నుండి భక్తులు సమర్పించిన కుంకుమ పసుపు , సారేలను అమ్మవారికి సమర్పించారు. గ్రామోత్సవం తో దసరా వేడుకలు ముగిశాయి.

దాడికి గురైన బాధితుడికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పరామర్శ

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

గిద్దలూరు, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 21:
కొమరోలు మండలంలో ఎంపిడిఓ కార్యాలయలయం నందు ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ సందర్భంగా ఎర్రగుంట్ల గ్రామం తెలుగుదేశం పార్టీ కి చెందిన కానగాని రామస్వామిపై వైసీపీ పార్టీ నేతలు రాళ్లు, కర్రలతో మూకుమ్మడిగా దాడి చేశారని, ఈ దాడిలో రామస్వామి పక్కటెముకలు విరిగి తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు. వైద్యులను అడిగి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో ఇలాంటి దాడులకు తావులేకుండా శాంతిభద్రతలను కట్టుదిట్టంగా పరిరక్షించాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో హింసకు తావులేకుండా, ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

మౌని రాయ్ కొత్త లుక్ చూసాక గుండె గల్లంతే!

అందాల నటి మౌనీ రాయ్ నిరంతరం తన ఇన్ స్టా పోస్టులతో యువహృదయాలను కొల్లగొడుతున్న సంగతి తెలిసిందే. తన తాజా ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌తో సోషల్ మీడియాలో మరోసారి హల్‌చల్ చేశారు. –ా స్టోరియన్..బిసో.. బిసోవ్ ఎక్స్ అనే క్యాప్షన్‌తో మౌని షేర్ చేసిన ఫోటో క్షణాల్లోనే వైరల్‌గా మారింది. ఆకర్షణీయమైన లుక్‌తో ఉన్న ఈ ఫోటోను చూసి అభిమానులు, నెటిజన్లు లైకులు, గుండె గుర్తు ఎమోజీలతో కామెంట్ సెక్షన్‌ను ముంచెత్తారు. ఈ పోస్ట్‌కు ఆమె తోటి సెలబ్రిటీల నుంచి కూడా విశేష స్పందన లభించింది. ప్రముఖ నటులు అర్జున్ బిజ్లానీ, అనుషా దండేకర్, అషీమా పర్దస్, ప్రముఖ స్టైలిస్ట్ అనుసోరు వంటి పరిశ్రమ స్నేహితులు ఫైర్, హార్ట్ ఎమోజీలను పోస్ట్ చేస్తూ ఆమె స్టైలింగ్– అందాన్ని ప్రశంసించారు. తోటి నటీనటులు, టెలివిజన్ ప్రముఖులు చూపిన ఈ ఆప్యాయత సోషల్ మీడియాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది .మౌనీ రాయ్ అభిమానులు, ఫ్యాన్ పేజీలు ఆమెను ఎంతగానో అభినందిస్తూ కామెంట్లు చేశారు. చాలామంది –రాకుమారి (షెహజాదీ)–, –డిస్నీ ప్రిన్సెస్–.. –దివా– అని అభివర్ణించారు. మౌని కేశాలంకరణ, దుస్తుల ఎంపికను మెచ్చుకుంటూ నెటిజన్లు ఆమెను ఫ్యాషన్ ఐకాన్‌గా అభివర్ణించారు.ఈ పోస్ట్ తో మౌని రాయ్ కు ఉన్న అంతర్జాతీయ, ప్రాంతీయ ప్రజాదరణ మరోసారి నిరూపితమైంది. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన శు భాకాంక్షలతో పాటు, సొంత రాష్ట్రమైన పశ్చిమ బెంగాల్‌కు చెందిన అభిమానులు --సుభో శారదీయ-- అని బెంగాలీ పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ కామెంట్లు చేశారు. భాషలు, సరిహద్దులతో సంబంధం లేకుండా మౌనీకి ఉన్న క్రేజ్‌కు ఇది నిదర్శనంగా నిలిచింది.మొత్తానికి ఒక్క పోస్ట్‌తో సోషల్ మీడియా వేదికగా ఈ స్థాయి స్పందన రావడం మౌనీ రాయ్ డిజిటల్ ఇంపాక్ట్ కి, స్టార్ డమ్‌కు అద్దం పడుతోంది. వెండితెరపైనే కాకుండా, సోషల్ మీడియాలోనూ తన విలక్షణమైన స్టైల్‌తో మిలియన్ల మంది అభిమానులను ఆకట్టుకుంటూ ఇంటర్నెట్ సెన్సేషన్‌గా కొనసాగుతున్నారు.

అలసటతో టీమిండియా.. సొంతగడ్డపై కివీస్ జోరు.. తొలి టీ20 రసవత్తరం

భారత్–న్యూజిలాండ్ మధ్య ఐదు టీ20ల సిరీస్

తొలి మ్యాచ్‌కు క్రైస్ట్‌చర్చ్ ఆతిథ్యం

బుమ్రా, హార్దిక్ లేకుండానే భారత్ బరిలోకి

ప్రయాణ అలసట నుంచి కోలుకోవాల్సిన టీమిండియా

న్యూజిలాండ్ పేస్ బౌలింగ్‌తో భారత్‌కు సవాల్

న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌కు భారత్ సిద్ధమైంది. అయితే, ఈసారి టీమిండియాకు ఎదురయ్యేది సాధారణ సవాల్ కాదు. వరుస ప్రయాణాలతో అలసట, కీలక ఆటగాళ్ల గైర్హాజరు, పేసర్లకు అనుకూలించే పరిస్థితులు.. ఇలా ఎన్నో సవాళ్లు భారత జట్టుకు ఎదురుచూస్తున్నాయి. మరోవైపు, సొంతగడ్డపై బలంగా కనిపిస్తున్న న్యూజిలాండ్ తొలి మ్యాచ్‌లోనే పైచేయి సాధించాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం క్రైస్ట్‌చర్చ్‌లో జరగనున్న తొలి టీ20 ఆసక్తికరంగా మారింది.

భారత జట్టుకు ఈ సిరీస్‌కు ముందు విశ్రాంతి తీసుకునే అవకాశం పెద్దగా లభించలేదు. అక్టోబర్ 3న జపాన్‌లో జరిగిన ఆసియా క్రీడల్లో స్వర్ణం సాధించిన అనంతరం, అక్టోబర్ 6 నుంచే వెస్టిండీస్‌తో స్వదేశంలో టీ20 సిరీస్ ఆడింది. బెంగళూరులో అక్టోబర్ 17న జరగాల్సిన నిర్ణయాత్మక మ్యాచ్ వర్షం కారణంగా రద్దవడంతో ఆ సిరీస్ 2–2తో ముగిసింది. అక్కడి నుంచి న్యూజిలాండ్‌కు చేరుకున్న భారత జట్టుకు క్రైస్ట్‌చర్చ్‌లో ఒక్కటే ప్రాక్టీస్ సెషన్ లభించింది. ప్రయాణ అలసట నుంచి కోలుకోవడం ఆటగాళ్లకు కీలకం కానుంది.జస్‌ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా ఈ సిరీస్‌కు దూరంగా ఉండటం భారత్‌కు ఎదురుదెబ్బ. టెస్టు సిరీస్‌ను దృష్టిలో పెట్టుకుని బుమ్రాకు విశ్రాంతి ఇచ్చారు. హార్దిక్ మాత్రం మార్చిలో జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్ తర్వాత అంతర్జాతీయ క్రికెట్ ఆడలేదు. దీంతో బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్‌లోనూ జట్టు కూర్పుపై మేనేజ్‌మెంట్ ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంది.మరోవైపు, న్యూజిలాండ్ జట్టు ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. ఇటీవల భారత్‌లో టెస్టు, వన్డే సిరీస్‌లను గెలిచిన ఆ జట్టు.. ఈసారి తమ ప్రధాన ఆటగాళ్లలో ఎక్కువమందితో బరిలోకి దిగుతోంది. గాయాల కారణంగా మార్క్ చాప్‌మన్, రచిన్ రవీంద్ర అందుబాటులో లేకపోయినా, ఫిన్ అలెన్, టిమ్ సీఫెర్ట్, డెవాన్ కాన్వే వంటి ఆటగాళ్లతో టాప్ ఆర్డర్ బలంగా కనిపిస్తోంది. ముఖ్యంగా స్వదేశంలో అలెన్ దూకుడు భారత్ బౌలర్లకు పరీక్షగా మారొచ్చు. జాకబ్ డఫీ, మాట్ హెన్రీ, ఆడమ్ మిల్నే, లాకీ ఫెర్గూసన్ వంటి పేసర్లు న్యూజిలాండ్ బౌలింగ్‌కు అదనపు బలం.భారత తుది జట్టు ఎంపిక కూడా ఆసక్తికరంగా మారింది. ఆసియా వెలుపల స్పిన్ ఆల్‌రౌండర్ల ప్రభావం తగ్గే అవకాశం ఉండటంతో నమన్ ధీర్ స్థానంలో నితీశ్ కుమార్ రెడ్డి, శివమ్ దూబే ఇద్దరికీ అవకాశం కల్పించే ఆలోచనలో టీమ్ మేనేజ్‌మెంట్ ఉన్నట్లు తెలుస్తోంది. తిరిగి జట్టులోకి వచ్చిన భువనేశ్వర్ కుమార్ ఆడే అవకాశం ఉంది. ఫిట్‌నెస్ సాధించిన వరుణ్ చక్రవర్తి స్థానంలో మూడో పేసర్‌గా ప్రిన్స్ యాదవ్‌ను తీసుకుంటారా అన్నది చూడాలి.

క్రైస్ట్‌చర్చ్‌లో మ్యాచ్ ప్రారంభమయ్యే రాత్రి 8 గంటల సమయానికి చలి పెరిగే అవకాశం ఉంది. సీజన్ ప్రారంభంలో ఉండే తాజా పిచ్ పేసర్లకు సహకరించొచ్చు. రెండో ఇన్నింగ్స్‌లో మంచు ప్రభావం కూడా ఉండే అవకాశంతో టాస్ గెలిచిన జట్టు ఛేజింగ్‌కు మొగ్గు చూపవచ్చు.

అయితే, గత రికార్డులు భారత్‌కు కొంత ఊరటనిస్తున్నాయి. న్యూజిలాండ్‌తో జరిగిన చివరి రెండు ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లను భారత్ గెలుచుకుంది. 2020 జనవరి నుంచి ఇప్పటివరకు ఇరు జట్ల మధ్య పూర్తయిన 20 టీ20ల్లో 16 మ్యాచ్‌ల్లో టీమిండియాదే విజయం. వ్యక్తిగతంగా ఇషాన్ కిషన్‌పైనా అందరి దృష్టి ఉంది. ఈ క్యాలెండర్ ఏడాదిలో టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత ఆటగాడిగా సూర్యకుమార్ యాదవ్ పేరిట ఉన్న 1,164 పరుగుల రికార్డును అధిగమించాలంటే ఇషాన్ మరో ఏడు పరుగులు చేయాలి. ప్రేక్షకులతో కిక్కిరిసే హాగ్లీ ఓవల్‌లో ఈ రికార్డు సాధిస్తాడా అన్నది ఆసక్తికరం.మ్యాచ్ వివరాలు: అక్టోబర్ 22, గురువారం మధ్యాహ్నం 12:30 గంటలకు మ్యాచ్ ప్రారంభం. వేదిక క్రైస్ట్‌చర్చ్‌లోని హాగ్లీ ఓవల్. టీవీలో సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఛానళ్లలో, ఆన్‌లైన్‌లో సోనీ –ా×ు యాప్, వెబ్‌సైట్‌లో ప్రత్యక్ష ప్రసారం చూడవచ్చు.

టీమిండియాకు భారీ ఎదురుదెబ్బ.. ఐపీఎల్ 2027 వరకు హార్దిక్ పాండ్యా దూరమేనా?

- ఐపీఎల్ 2027 వరకు ఆటకు పాండ్యా దూరమయ్యే అవకాశం ఉందంటున్న నివేదికలు
- బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చికిత్స
- మరో మూడు వారాల తర్వాత జాగింగ్ ప్రారంభించే అవకాశం
- ఆ తర్వాత ఎనిమిది వారాల్లో పరుగుల సాధన క్రమంగా పెంపు
- శ్రీలంక, జింబాబ్వే సిరీస్‌లకు దూరమయ్యే ప్రమాదం

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా అభిమానులకు నిరాశ కలిగించే వార్త. అతడు మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టేందుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని ఓ నివేదిక వెల్లడించింది. కాలి కండరాల లోపలి భాగంలో ఏర్పడిన స్ట్రెస్ గాయం నుంచి కోలుకుంటున్న హార్దిక్.. వచ్చే ఏడాది మార్చిలో ప్రారంభమయ్యే అవకాశం ఉన్న ఐపీఎల్ 2027 వరకు పోటీ క్రికెట్‌కు దూరంగా ఉండొచ్చని తెలిపింది. అయితే, అతడి పునరాగమనంపై బీసీసీఐ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు.ప్రస్తుతం హార్దిక్ బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పునరావాస చికిత్స తీసుకుంటున్నాడు. 'దైనిక్ జాగరణ్' కథనం ప్రకారం.. అతడి వైద్య నివేదికలను గత వారం డాక్టర్ దిన్‌షా పార్దీవాలా పరిశీలించారు. వైద్యుల సూచనల మేరకు దశలవారీగా ఫిట్‌నెస్ సాధించే కార్యక్రమాన్ని హార్దిక్ కొనసాగిస్తున్నాడు.పునరావాస ప్రణాళిక ప్రకారం మరో మూడు వారాల తర్వాత అతడు నెమ్మదిగా జాగింగ్ ప్రారంభించే అవకాశం ఉంది. ఆ తర్వాతి ఎనిమిది వారాల్లో పరుగెత్తే సమయాన్ని, తీవ్రతను క్రమంగా పెంచనున్నారు. గాయంపై మళ్లీ ఒత్తిడి పడకుండా స్ట్రెంత్ ట్రైనింగ్‌ను కూడా జాగ్రత్తగా పెంచుతున్నారు. పూర్తి స్థాయి మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించడానికి ఎంత సమయం పడుతుందనే దానిపై ఇంకా స్పష్టత లేదు.

ఈ పరిస్థితి కొనసాగితే డిసెంబర్ 13 నుంచి ప్రారంభం కానున్న శ్రీలంకతో వన్డేలు, టీ20ల సిరీస్‌కు హార్దిక్ దూరమయ్యే అవకాశం ఉంది. జనవరి 3 నుంచి జరగనున్న జింబాబ్వేతో వన్డే సిరీస్‌లోనూ ఆడకపోవచ్చని నివేదిక పేర్కొంది. ఇప్పటికే అతడు న్యూజిలాండ్ పర్యటనకు ఎంపిక కాలేదు.2026లోనూ హార్దిక్ పలు సిరీస్‌లకు దూరమయ్యాడు. అతడు చివరిసారిగా ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ తరఫున మే నెలలో మ్యాచ్ ఆడాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో చివరిసారిగా మార్చిలో జరిగిన 2026 టీ20 ప్రపంచకప్ ఫైనల్లో కనిపించాడు. హార్దిక్ త్వరగా కోలుకోవడం టీమిండియాకు కీలకం కానుంది.

ఐపీఎల్ రికార్డుల వీరుడు.. ఇక ఢిల్లీ స్పిన్నర్లకు గురువు

భారత మాజీ లెగ్ స్పిన్నర్, ఐపీఎల్ రికార్డుల వీరుడు అమిత్ మిశ్రా తన క్రికెట్ ప్రస్థానంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాడు. రాబోయే 2027 ఐపీఎల్ సీజన్‌కు గాను ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు స్పిన్ బౌలింగ్ కోచ్‌గా అతడు నియమితులయ్యాడు.

విశేషమేమిటంటే.. 2008లో తన ఐపీఎల్ ప్రయాణాన్ని ఏ జట్టుతో అయితే ప్రారంభించాడో, అదే జట్టుతో ఇప్పుడు కోచింగ్ కెరీర్‌ను మొదలుపెట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ విషయాన్ని ఢిల్లీ క్యాపిటల్స్ అధికారికంగా ప్రకటించింది.ఈ నియామకం పై అమిత్ మిశ్రా సంతోషం వ్యక్తం చేశాడు. "ఢిల్లీ దిల్ వాలోం కీ హై (ఢిల్లీది పెద్ద మనసు). నేను తొలిసారి ఐపీఎల్ ఆడినప్పుడు ఢిల్లీ జట్టులో భాగమయ్యాను. ఇప్పుడు నా కోచింగ్ కెరీర్‌ను కూడా ఢిల్లీతోనే ప్రారంభిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఢిల్లీ నా గుండెచప్పుడు. ఎన్నో ఏళ్లుగా ఢిల్లీ అభిమానులు ఎదురుచూస్తున్న ఆనందాన్ని, విజయాన్ని వారికి అందించడానికి గట్టిగా ప్రయత్నిస్తాం" అని ఫ్రాంచైజీ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఒక వీడియోలో మిశ్రా పేర్కొన్నాడు.43 ఏళ్ల అమిత్ మిశ్రా 2025 సెప్టెంబర్‌లో అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఐపీఎల్‌లో కోచింగ్ బాధ్యతలు చేపట్టడం అతనికి ఇదే తొలిసారి. తన ఫ్లైటెడ్, స్లో లెగ్ బ్రేక్‌లతో బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టిన మిశ్రాకు ఐపీఎల్‌లో అద్భుతమైన రికార్డు ఉంది. ఈ లీగ్ చరిత్రలో మూడు హ్యాట్రిక్‌లు (2008, 2011, 2013) సాధించిన ఏకైక బౌలర్‌గా రికార్డు సృష్టించాడు. 2008 నుంచి 2024 వరకు ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ (గతంలో డేర్‌డెవిల్స్), డెక్కన్ ఛార్జర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. మొత్తం 162 మ్యాచ్‌లలో 7.37 ఎకానమీ రేటుతో 174 వికెట్లు పడగొట్టాడు.గత కొన్ని సీజన్లుగా పేలవ ప్రదర్శనతో నిరాశపరుస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్, జట్టును పూర్తిగా ప్రక్షాళన చేసే పనిలో పడింది. గత సీజన్‌లో ఆరో స్థానంలో నిలిచిన ఈ జట్టు ఇప్పటివరకు ఒక్కసారి కూడా ఐపీఎల్ టైటిల్ గెలవలేదు. ఈ క్రమంలోనే భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీని కొత్త హెడ్ కోచ్‌గా నియమించింది.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776